

పోటాపోటీగా నిరసనలు

వైసీపీ, టీడీపీ శ్రేణులు పోటాపోటీ నిరసనలతో గురువారం బందరు హోరెత్తింది. పోలీస్ అధికారులు అంతా హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటనలో ఉండగా, వైసీపీ మహిళా నేతలు మంత్రి కొల్లు రవీంద్ర ఇంటి సమీపంలో చీపుర్లతో నిరసన ప్రదర్శన చేశారు. మంత్రి చిత్రపటాలను నేలపై వేసి కాళ్లతో తొక్కుతూ విమర్శలు చేశారు. ప్రతిగా తెలుగు మహిళలు పేర్ని నాని ఇంటి సమీపంలో నిరసన ప్రదర్శన చేసి, పేర్ని దిష్టిబొమ్మను దహనం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరు పార్టీలను అదుపు చేశారు.





రామానాయుడుపేట సెంటర్లో పేర్ని నాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న టీడీపీ నాయకులు, మహిళలు

బందరులో రోడ్డెక్కిన వైసీపీ, టీడీపీ శ్రేణులు

మంత్రి రవీంద్ర ఇంటి సమీపంలో చీపుర్లతో వైసీపీ మహిళల ఆందోళన

- కొల్లు చిత్రపటాలు కిందపడేసి కాళ్లతో తొక్కుతూ వ్యతిరేక నినాదాలు
- ప్రతిగా స్పందించి రోడ్డుపైకి వచ్చిన తెలుగు మహిళలు
- పేర్ని ఇంటి సమీపంలో నాని దిష్టిబొమ్మ దహనం
- వారం రోజులుగా కొనసాగుతున్న ఇరుపార్టీల మాటల యుద్ధం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో టీడీపీ, వైసీపీ మధ్య నెలకొన్న రాజకీయ వివాదం రోజు రోజుకు తీవ్ర మవుతోంది. అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తుంటే, దీనికి పోటీగా వైసీపీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' పేరుతో నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరి స్తున్నారు. మాజీ మంత్రి పేర్ని నాని ఓ అడుగు ముందుకేసి కూటమి అధినాయకులపై, జిల్లాకు చెందిన మంత్రి కొల్లు రవీంద్ర, శాసన సభ్యులపై అవినీతి ఆరోప ణలు చేస్తున్నారు. దీంతో మచిలీపట్నానికి చెందిన మంత్రి రవీంద్ర, మాజీ మంత్రి పేర్ని మధ్య వారం రోజులుగా మాటల యుద్ధం నడుస్తోంది.

పామర్రులో ప్రారంభమైన గొడవ..

పామర్రు నియోజకవర్గంలో జరిగిన వైసీపీ నియోజకవర్గస్థాయి సమావేశంలో మిగతా 6లో..

మచిలీపట్నంలో దిష్టిబొమ్మల దహనం, చీపుర్లతో నిరసనలు

కూటమి నాయకులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పేర్ని నాని దిష్టిబొమ్మను మూడు రోజుల క్రితం చల్లపల్లిలో దహనం చేశారు. మచిలీపట్నంలో తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం చీపుర్లు చేతపట్టి పేర్ని నాని ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో రామానాయుడుపేట సెంటర్‌లో చీపుర్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. హోంమంత్రి వంగలపూడి అనిత మచిలీపట్నంలో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు రావడంతో పోలీస్ అధికారులంతా ఈ కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నారు. ఇదే అదనుగా భావించిన వైసీపీ మహిళా విభాగం నేతలు, మేయర్‌లు, డెప్యూటీ మేయర్‌లు మంత్రి కొల్లు రవీంద్ర నివాసానికి సమీపంలోని జవ్వారుపేట సెంటరుకు చీపుర్లు చేతపట్టి వెళ్లి మంత్రి కొల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి ఫొటోలను కిందపడవేసి కాళ్లతో తొక్కారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇదిలా ఉంటే గురువారం సాయంత్రం తెలుగు మహిళలు, టీడీపీ నాయకులు మూకుమ్మడిగా తరలివచ్చి పేర్ని నాని ఇంటి సమీపంలోని రామా నాయుడుపేట సెంటరులో పేర్ని దిష్టిబొమ్మను దహనం చేశారు. రెండు రోజుల వ్యవధిలో జరిగిన ఈ ఘటనలతో మచిలీపట్నంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోననే చర్చ నడుస్తోంది. ఇప్పట్లో ఎన్నికలు లేకున్నా, టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య మాటల యుద్ధం ఒకవైపు, మరోవైపు నిరసన ప్రదర్శనలు జరుగుతుండటంతో పోలీసులకు సవాల్‌గా మారింది. రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని మచిలీపట్నం నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు తమదైన శైలిలో వ్యవహరించి మచిలీపట్నంలో పరిస్థితులను అదుపులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



జవ్వారుపేట సెంటర్‌లో మంత్రి రవీంద్ర ఫొటోలు, చీపుర్లతో వైసీపీ మహిళలు

పోలీసులకు అత్యాధునిక శిక్షణ

కరగ్రహారంలో జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన

హోంమంత్రి వంగలపూడి అనిత



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హోంమంత్రి అనిత, చిత్రంలో మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ప్రభుత్వ విప్ యార్లగడ్డ, గుడివాడ, పామర్రు ఎమ్మెల్యేలు రాము, కుమార్ రాజా, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి, ముడా చైర్మన్ ప్రసాద్, డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ గంగాధరరావు తదితరులు

మచిలీపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులకు అత్యాధునిక శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, శాసన సభ్యులతో కలిసి మచిలీపట్నం మండలం చినకరగ్రహారం గ్రామంలో జిల్లా పోలీస్ శిక్షణకేంద్రం భవనాల నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ ఎందరో మహానుభావులకు పుట్టినిల్లు, కళాసంస్కృతులకు నిలయమైన కృష్ణాజిల్లాలో పోలీస్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతంలో ఉన్న పోలీస్ శిక్షణ కేంద్రం స్థలాన్ని ఏపీ మారిటైమ్ బోర్డు తీసుకోవడంతో చినకరగ్రహారంలో 46 ఎకరాలలో అత్యాధునిక వసతులతో ఈ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసుశాఖలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు అధికమయ్యాయని, వాటిని అరికట్టేందుకు కానిస్టేబుల్ స్థాయి నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు ఈ కేంద్రంలో శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర అభ్యర్థన మేరకు ఈ ప్రాంతంలోని మెరైన్ పోలీసులకు మిగతా 6లో..

వీడిన చిక్కుముడి

వెస్ట్ బైపాస్ పనులకు మార్గం సుగమం

- పాత అలైన్‌మెంట్ ప్రకారమే విద్యుత్ టవర్ల మార్పిడి
- నవంబరు, డిసెంబరు నాటికి అందుబాటులోకి..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పశ్చిమ బైపాస్ (ప్యాకేజీ-3) చిక్కుముడి వీడింది. దాదాపు ఆరు నెలలుగా రైతులతో నెలకొన్న విద్యుత్ హైటెన్షన్ లైన్ల అలైన్‌మెంట్ వివాదానికి జాతీయ రహదారుల సంస్థ అధికారులు ఫుల్‌స్టాప్ పెట్టారు. ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ లైన్ల అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనను వారు విరమించుకున్నారు. పాత అలైన్‌మెంట్ విధానంలో కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. గతంలో ల్యాంకో సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వారి స్థలాల్లో టవర్లను తొలగించటానికి వీలుగా అదే లైన్‌లో వేరేచోట టవర్లను వేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం జక్కంపూడిలోని రెండు టవర్లతో సమస్య నెలకొంది. ఈ రెండు టవర్లు తక్కువ ఎత్తులో ఉండటంతో ఈ ప్రాంతంలో ఆర్‌వోబీ నిర్మాణ పనులకు ఇబ్బంది ఏర్పడింది. ఈ రెండు టవర్లను ఇప్పుడున్న చోటే, కొత్తగా ఎత్తయిన రెండు టవర్లు వేసి, వాటికి కనెక్షన్ ఇవ్వాలనుకున్నారు. కొత్త టవర్లు ఎత్తుగా ఉండటం వల్ల జక్కంపూడి దగ్గర ఆర్‌వోబీ నిర్మాణ పనులకు ఇబ్బంది ఉండదు. రెండు నెలల్లో ఈ పనులు పూర్తి చేయాలని ఎన్‌హెచ్ అధికారులు నిర్ణయించారు. ఈ పనులు పూర్తికాగానే, రోడ్డు కాంట్రాక్టు సంస్థ పనులు చేపడుతుంది. ఈ సమస్యకు సంబంధించి రైతులు ఆరు నెలలుగా కోర్టులో పోరాడుతున్నారు. ప్రధాన మంత్రి కార్యాలయానికి, కేంద్ర రహదారుల శాఖ మంత్రికి ఫిర్యాదు కూడా చేశారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించి ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని శివనాథ్, స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కమిటీని వేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోమని ఆదేశించింది. ఈ కమిటీ సిఫార్సులకు జాతీయ రహదారుల సంస్థ అంగీకారం తెలపడంతో కథ సుఖాంతమైంది. దీంతో విజయవాడ వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-3 పనులు నవంబరు, డిసెంబరు నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

మ్యాపింగ్‌ను మార్చండి

గతంలోని ప్రజాసాధికార సర్వేనే అమలు చేయాలి

- వైసీపీ ప్రభుత్వంలో ఇంటింటి మ్యాపింగ్‌కు శ్రీకారం
- కుటుంబాల లెక్కల్లో వివక్ష.. వైసీపీ వారికే న్యాయం
- తిరిగి ప్రజాసాధికార సర్వేను తెస్తే అందరికీ సమన్యాయం
- ఐదేళ్లు ఏ పథకాలూ అందని తెలుగు తమ్ముళ్ల అభిప్రాయం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో తలపెట్టిన 'మ్యాపింగ్'ను కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తుండటంపై తెలుగు తమ్ముళ్లు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. అప్పుడు, ఇప్పుడు కూడా ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారుల ఎంపికలో అన్యాయం జరుగుతోందని అభిప్రాయపడుతున్నారు. ఇదే విధానాన్ని ముందుకు తీసుకెళ్లడం వల్ల భవిష్యత్తులో సమస్యలు ఉత్పన్నమవుతాయని అంటున్నారు. సొంత పార్టీకి చెందినవారికి కూడా అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఈ మ్యాపింగ్ విధానాన్ని తీసుకొచ్చిందని, దానిని రద్దుచేసి గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన 'ప్రజాసాధికార సర్వే'ను అమల్లోకి తీసుకురావాలంటున్నారు. అప్పుడైతేనే పార్టీలకతీతంగా మిగతా 6లో..

అర్హులందరికీ పథకాల వర్తింపు


గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాసాధికార సర్వే నిర్వహించేవారు. రేషన్ కార్డుల ప్రాతిపదికనే ఈ సర్వే జరిగింది. ప్రజలందరికీ తెలిసేలా ఆన్‌లైన్‌లో (పబ్లిక్ డొమైన్)లో డేటా ఉంచింది. ఎవరైనా.. వారి రేషన్‌కార్డు, ఆధార్ కార్డు నెంబర్లను ఎంటర్ చేయగానే కుటుంబ వివరాలన్నీ తెలిసేవి. అన్ని పార్టీలకూ సమానంగా వారి అర్హతల ప్రాతిపదికన పథకాలు అందేవి. కాబట్టి ఆ సర్వేను ఇప్పుడు కూడా అమలు చేయాలని టీడీపీ శ్రేణులు కోరుతున్నాయి.

వైసీపీ హయాంలో మ్యాపింగ్ మైండ్‌గేమ్

వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రజాసాధికార సర్వేను కాదని, మ్యాపింగ్ విధానాన్ని ఎంచుకుంది. గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటుచేసిన కొత్తలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించాలన్న ఉద్దేశంతో ఈ మ్యాపింగ్‌ను చేపడుతున్నట్టు ప్రకటించింది. దీనిద్వారా ఇంట్లో ఎన్ని కుటుంబాలు నివసిస్తున్నాయో మ్యాపింగ్ చేశారు. ఆ మాటున వైసీపీ ప్రభుత్వం మైండ్‌గేమ్ ఆడింది. ఈ మ్యాపింగ్‌ను వలంటీర్లు చేయగా, వైసీపీకి చెందిన వారు, ఆ పార్టీ అభిమానులు, సానుభూతిపరులకు ప్రయోజనం చేకూరేలా కుటుంబాల సంఖ్యను ఎక్కువగా చూపించారు. ఉమ్మడి కుటుంబాలను కూడా రెండుగా మ్యాపింగ్ చేశారు. ఇలా చేయడం వల్ల వైసీపీ అనుయాయులకే సంక్షేమ పథకాలు దక్కేవి. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులకు మాత్రం ఈ మ్యాపింగ్‌లో అన్యాయం జరిగింది. వేర్వేరు రేషన్ కార్డులు ఉన్నప్పటికీ ఒకే కుటుంబంగా చూపించారు. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డుల అర్హత ప్రామాణికతను రద్దు చేసింది. కేవలం నిత్యావసరాల కోసం రైస్‌కార్డులు చెలామణి అయ్యేలా చేసింది. దీంతో ఒకే ఇంట్లో రెండు రేషన్ కార్డులున్నా.. సచివాలయ మ్యాపింగ్‌లో ఒకే కుటుంబంగా ఉంటే మాత్రం ఆ కుటుంబంలో ఒక్కరే పథకాలకు అర్హులయ్యేవారు. రెండు కుటుంబాలుగా ఉంటే ఇద్దరు అర్హత సాధించేవారు. భూములు, స్థలం, సొంత కార్లు, విద్యుత్ యూనిట్ల వాడకం, ఆదాయం వంటి అంశాలను నిర్దేశిత విధంగా ఉండాలన్న నిబంధనలను పొందుపరిచారు. వీటి మాటున పథకాలను కట్టడి చేసే వ్యూహాన్ని అమలు చేశారు. ఈ మ్యాపింగ్ విధానంతో తాము నష్టపోయామని టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి.

పామర్రు ఏఎంసీ చైర్మన్‌గా జన్ను శోభన్‌బాబు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



శోభన్‌బాబు

పామర్రు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పామర్రు ఏఎంసీ చైర్మన్‌గా జుజ్జవరం గ్రామానికి చెందిన బీసీ గౌడ సామాజిక వర్గానికి చెందిన జన్ను శోభన్‌బాబు నియమితులయ్యారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి అంకితభావంతో సేవలందిస్తున్న శోభన్ బాబు పేరును ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పార్టీ అధిష్ఠానానికి ప్రతిపాదించారు. సీఎం చంద్రబాబు జరిపించిన ఐవీఆర్ఎస్ సర్వేలో సైతం శోభన్‌బాబుకు అనుకూలంగా నివేదిక అందడంతో పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శోభన్‌బాబును ఎంపిక చేశారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు గురువారం రాత్రి వెలువడ్డాయి. శోభన్‌బాబు గతంలో జుజ్జవరం గ్రామ సర్పంచ్‌గా, పీఏసీఎస్ అధ్యక్షుడిగా, గ్రామ పాలకేంద్రం అధ్యక్షుడిగా పనిచేశారు. ఏఎంసీ చైర్మన్‌గా శోభన్‌బాబు నియామకంపై స్థానిక కూటమి నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



విశేష అలంకరణలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం



స్వామి వారికి పట్టుపవిత్రాలు సమర్పిస్తున్న ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు

మోపిదేవి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పవిత్రోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. విశేషాలంకరణతో స్వామివారు, అమ్మవార్లను మయూర వాహనంపై ఆశీనులు గావించగా, వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు జ్యోతి వెలిగించి పవిత్రోత్సవ సహిత కృత్తిక మహోత్సవాలను ప్రారంభించారు. గోపూజ, సుప్రభాత సేవ, ఆలయ ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, అఖండ స్థాపన, వాస్తు మండపారాధన, సుబ్రహ్మణ్య మూలమంత్ర అనుష్ఠానాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రధాన దేవతా సహిత మండపారాధన, పట్టు పవిత్రముల ఆపాదన, అదివాసముల చతుర్వేద స్వస్తి జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రేమికుల మధ్య మనస్పర్థలు
- గడ్డిమందు తాగి యువకుడి మృతి
8

ప్రభుత్వాస్పత్రిలో హార్ట్ సర్జరీలకు బ్రేక్
- వైద్యుల కొరతతో ఆగిన బైపాస్ సర్జరీలు
- ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలని సూచిస్తున్న వైద్యులు
8

అక్రమ కేసులు ఎవరివో తేల్చుకుందామా..
- పేర్ని నానికి యార్లగడ్డ సవాల్
8

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు
6

వీఎంసీకి సూపర్ స్వచ్ఛత లీగ్ అవార్డు

గార్బేజ్ ఫ్రీ సిటీ (జీఎఫ్‌సీ)లో సెవెన్ స్టార్ రేటింగ్



కార్పొరేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షన్-2024లో విజయవాడ నగరపాలక సంస్థ సూపర్ స్వచ్ఛత అవార్డును అందుకుంది. గార్బేజ్ ఫ్రీ సిటీలో సెవెన్ స్టార్ రెటింగ్‌ను కైవసం చేసుకుంది. 10లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన నగరాల కేటగిరిలో వీఎంసీ ఈ అవార్డు అందుకుంది. ఇండోర్, సూరత్, నవీ ముంబై తరువాత విజయవాడ ఈ అవార్డును దక్కించుకుంది. స్వచ్ఛ సర్వేక్షన్- 2024 పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం గురువారం న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగింది. సూపర్ స్వచ్ఛత లీగ్ పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రి పొంగూరు నారాయణ, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో 10 లక్షల జనాభా కంటే ఎక్కువ ఉన్న జాబితాలో విజయవాడ నగరపాలక సంస్థ, ఇండోర్, సూరత్, నవీ ముంబై తర్వాత చేరుకోవటం ఇదే మొదటి సారి అని, విజయవాడకు మరో పురస్కారం గార్బేజ్ ఫ్రీ సిటీ కేటగిరీలో సెవెన్ స్టార్ రేటింగ్ వచ్చిందన్నారు. వీఎంసీతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో ఐదు నగరాలకు అత్యుత్తమ పురస్కారమైన స్వచ్ఛ సర్వేక్షన్ పురస్కారాలు అందుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, 2021 తర్వాత మళ్లీ అవార్డు అందుకోవటం ఇది రెండోసారి అని, ఇప్పటివరకు విజయవాడ నగరపాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షన్ ఉత్తమ స్థానాలలోనే కైవసం చేసుకుందని, ప్రసుత్తం సూపర్ స్వచ్ఛత లీగ్ పురస్కారం దక్కిందన్నారు. ఈ సందర్భంగా నగర ప్రజలు, పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నగర కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం మాట్లాడుతూ, సూపర్ స్వచ్ఛత లీగ్‌లో స్థానం దక్కించుకోవాలంటే గత మూడేళ్లలో ఒక్కసారైనా ప్రథమ మూడు స్థానాల్లో స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు గెలిచి ఉండాలని, 2024వరకు మొదటి 20 స్థానాలలో నగరం ఉండాలని, ఈ నిబంధనలకు అనుగుణంగా సూపర్ స్వచ్ఛత లీగ్‌లో అత్యుత్తమ స్థానాలలో ఉన్న ఇండోర్, సూరత్, నవీ ముంబైతోపాటు విజయవాడ నగరపాలక సంస్థ కూడా స్థానం దక్కించుకుందన్నారు. దీనిలో గత మూడు సంవత్సరాలుగా విజయవాడ నగరపాలక సంస్థను ఉత్తమ స్థానాల్లో నిలిపిన కమిషనర్ల పాత్ర ఎంతో ఉందన్నారు. ముఖ్యంగా ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ కుమార్, డాక్టర్ పి.సంపత్‌కుమార్, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఎండీ వి.అనిల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డి.చంద్రశేఖర్, ఎస్ఈ ప్రాజెక్ట్ పి.సత్యకుమారి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ రజియా షబినా తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం ప్రమేయం లేకుండా కమిటీలా!

- సహకార సంఘాల త్రీమెన్ కమిటీల ఎంపికపై పలువురు నాయకుల ఆగ్రహం
- తెలంగాణ ప్రాంతంలో రహస్యంగా ఎంపిక
- గతంలోను కమిటీల ఎన్నికలో వారిదే హవా
- ప్రస్తుత కమిటీలపై స్థానిక నేతల విస్మయం

(తిరువూరు,ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సహకార సంఘాల త్రీమెన్ కమిటీల ఎంపిక విజయవాడ ఎంపీ, తిరువూరు నియోజకవర్గం ప్రజాప్రతినిధులతో నిమిత్తం లేకుండా, పార్టీ బాధ్యులమని చెప్పుకునే కొందరు తమ ఇష్టానుసారంగా పేర్లు ప్రతిపాదించినట్టు స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, త్రీమెన్ కమిటీపై అభ్యంతరం తెలిపేందుకు ఎంపీని కలిసేందుకు విజయవాడకు వెళ్లారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 34 సొసైటీలకు త్రీమెన్ కమిటీలను అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ, కమిటీ పేర్లు అంటూ బయటకు రావడంతో కమిటీలను మార్చాలనే డిమాండ్ నాయకుల్లో వ్యక్తం అవుతోంది. తిరువూరు నియోజకవర్గంలో మొత్తం 34 సొసైటీలకుగాను తిరువూరు మండలంలో 8 సొసైటీలు, గంపలగూడెంలో 12 సొసైటీలు, విస్సన్నపేటలో 7 సొసైటీలు, ఎ.కొండూరు 7 సొసైటీలు ఉన్నాయి. గతంలో కొన్ని సొసైటీలకు కమిటీలను స్థానిక నాయకత్వం ఎకగ్రీవంగా ఎంపిక చేయగా, మిగిలిన సొసైటీలకు త్రిసభ్య కమిటీ ఎంపీక కొందరు వ్యక్తులు తెలంగాణ రాష్ట్రంలోని ఓ గ్రామంలో కూర్చుని కమిటీ పేర్లు రాసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సొసైటీలకు ఇప్పటికే నియోజకర్గంలోని వివిధ మండలాల్లో సీనియర్లు, పార్టీకోసం పనిచేసిన వారిని విస్మరించి ఎటువంటి అర్హత లేకపోయినా కీలక పదవులు కట్టబెట్టారని, దీనిపై ఆగ్రహంతో ఉన్న కొందరు నాయకులు, కార్యకర్తలు 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమానికి దూరంగా ఉంటున్నట్టు సమాచారం. సొసైటీల్లో బైటవారి పెత్తనాన్ని సహించేదిలేదని, పార్టీ అధిష్టానం దృష్టిసారించి సొసైటీ త్రీమ్యాన్ కమిటీలో తొలినుంచి పార్టీకి కట్టుబడి పనిచేసిన వారికి అవకాశం కల్పించాలని నియోజకవర్గం పార్టీ శ్రేణులు విజ్ఞప్తి చేస్తున్నారు.


ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ, మృతురాలు శ్రీలక్ష్మి

లారీ ఢీకొని మహిళ మృతి

కూచిపూడి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మొవ్వ మండలం నిడుమోలు జాతీయ రహదారిపై వేగంగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో కొరిమెర్ల గ్రామానికి చెందిన కొల్లి శ్రీలక్ష్మి (47) అక్కడికక్కడే మృతి చెందింది. కూచిపూడి ఎస్ఐ కె.ఎస్.విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు శ్రీలక్షికి నిడుమోలులో వ్యవసాయ భూమి ఉంది. గురువారం పొలంలో నాట్లు వేయించి మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై కొరిమెర్లలోని ఇంటికి వెళ్తుండగా, లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోటాపోటీగా నిరసనలు

(5వ పేజీ తరువాయి)

మాజీ మంత్రి పేర్ని నాని రప్పా రప్పా అనడం కాదు, కనుసైగ చేస్తే చీకట్లో పని అయిపోవాలి అంటూ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేపాయి. కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన పేర్ని నానిపై టీడీపీ నాయకులు మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లోని పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదులు చేశారు. గుడివాడలో జరిగిన వైసీపీ సమావేశానికి వెళుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఆమె భర్త రామును టీడీపీ నాయకులు అడ్డగించడంతో పరుష పదజాలంతో దూషించి, కారు అద్దాలు పగలకొట్టారని విస్తృతంగా ప్రచారం చేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన జెడ్పీ చైర్‌పర్సన్‌ను టీడీపీ నాయకులు, కార్యకర్తలు దుర్భాషలాడారని, ఈ విషయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారానికి వాడుకోవాలని మాజీ మంత్రి పేర్ని నాని పార్టీ అధిష్టానంతో ఫోన్‌లో మాట్లాడిన వీడియో బయటకు వచ్చింది. దీంతో వైసీపీ నాయకులు తమ కేడర్‌ను కాపాడుకునేందుకే ఈ తరహా ప్రయోగాలు చేస్తున్నారనే అంశం వెలుగులోకి వచ్చింది. పెడన నియోజకవర్గంలో జరిగిన వైసీపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాజీ మంత్రి పేర్ని నాని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్రలను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్‌పై టీడీపీ నాయకులు దాడి చేసి, కారు అద్దాలు పగలకొట్టారని చెప్పారు. దీంతో ఈ అంశం మరింత రాజకీయంగా చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో వైసీపీకి చెందిన జిల్లా పరిషత్ చైర్మన్‌లు కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసి తమ సంఘీభావం తెలిపారు.


సీఐ పరమేశ్వర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

ఇనకుదురు పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్ : రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఫొటోను కాళ్లతో తన్నిన వైసీపీ శ్రేణులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, టీడీపీ నాయకులు, పిప్పళ్ల కాంతారావు, యువరాజ్, గోకుల శివ తదితరులు ఇనకుదురు సీఐ పరమేశ్వర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఇటువంటివి భవిష్యత్తులో జరగకుండా చూడాలని కోరారు.

సంక్షేమ వసతి గృహాల్లో ఆహార కమిషన్ చైర్మన్ తనిఖీలు

కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ తూర్పు- సెంట్రల్‌లో ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు. ఏపీ ఫుడ్ కమిషన్ వాట్సాప్ నెంబర్ 9490551117కు వీడియో ఆధారాలతో సహా హాస్టల్ పిల్లలు ఫిర్యాదులు చేయడంతో చైర్మన్ ఆకస్మిక తనిఖీని నిర్వహించారు. తనిఖీలో భాగంగా సాయంత్రం 7 గంటలకు కిచెన్ రూంలో వంట కూడా మొదలుపెట్టలేదు. చైర్మన్, విద్యార్థులతో మాట్లాడగా ప్రతిరోజు ఉదయం అల్పాహారం తగినంత పెట్టడం లేదని, మధ్యాహ్నం పెరుగు బదులు మజ్జిగ ఇస్తున్నారని సాయంత్రం స్నాక్స్ (తినుబండారాలు) ఇవ్వడం లేదని రాత్రిపూట ఫ్రూట్స్ ఇవ్వడం లేదని హాస్టర్ విద్యార్థులు తెలిపారు. వారంలో రెండుసార్లు ఇచ్చే చికెన్ కూడా ప్రభుత్వం నిర్ణయించిన పరిమాణం (175గ్రా) అయితే 50 గ్రాములు కూడా ఇవ్వడం లేదని, ఇవే కాకుండా హాస్టల్లో నీటి సమస్య, బాత్రూం క్లీనింగ్ సమస్య, విద్యుత్ సమస్యలు ఉన్నాయని విద్యార్థులు చైర్మన్‌కు వివరించారు. శుక్రవారం ఉదయం నుంచి మెనూ సక్రమంగా విద్యార్థులకు అందేలా ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.


సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి


బాధ్యతల అనంతరం సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ఏఎంసీ చైర్మన్‌గా నర్రా వాసు బాధ్యతల స్వీకారం

గొల్లపూడి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా నర్రా వాసు గురువారం బాధ్యతలు చేపట్టారు. గొల్లపూడిలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శారదా రాణి చైర్మన్‌తో ప్రొసీజర్ ప్రకారం బాధ్యతలు అప్పగించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఉపయోగపడే విధంగా నిర్ణయాలు తీసుకుని అమలు పరుస్తామన్నారు. రైతులకు ప్రభుత్వానికి వారధిలా ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని అన్ని గ్రామాల రైతులు ఏ సమయంలోనైనా తనను కలవవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవ్, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, టీడీపీ అధ్యక్షుడు నూతులపాటి వెంకటేశ్వరరావు, గూడపాటి పద్మశేఖర్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకుడు డాక్టర్ లక్ష్మణ్ దత్

- విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వక్తలు

కానూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ది కేసీపీ లిమిటెడ్ చైర్‌పర్సన్, ఎండీ వీఎల్ ఇందిరాదత్ కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో గురువారం ది కేసీపీ లిమిటెడ్ మాజీ చైర్మన్ దివంగత వెలగపూడి లక్ష్మణ్ దత్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఇందిరా దత్ మాట్లాడుతూ.. విద్య, పరిశ్రమలకు ఆయన చేసిన సేవలు మరువలేనివని, దార్శనిక నాయకుడని కొనియాడారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ప్రజలకు సేవచేయాలనే లక్ష్యాన్ని విజయవంతంగా నెరవేర్చారని ఆమె పేర్కొన్నారు. కేసీపీ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ వి.కవితా దత్ ప్రసంగిస్తూ విద్యాదానం ఎంతో గొప్పదని, అది వ్యక్తి, సమాజంపై శాశ్వత ముద్రవేస్తుందన్నారు. మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ దత్ దాతృత్వ ప్రయత్నాలను ప్రశంసించారు. ప్రపంచ తెలుగు సమాఖ్యలో డాక్టర్ ఇందిరా దత్ పాత్రను కొనియాడారు. కార్యక్రమంలో కేసీపీ లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్ చిట్టూరి రవి, సిద్ధార్థ అకాడమి ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి పి.లక్ష్మణరావు, అధ్యక్షులు ఎం.రాజయ్య, సిద్ధార్థ వర్సిటీ వీసీ పి.వెంకటేశ్వరరావు, వీసీ ఏవీ రత్నప్రసాద్, కన్సల్టెన్సీ డైరెక్టర్ ప్రొఫసర్ బి.పాండురంగారావు, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ వెలగపూడి లక్ష్మణ దత్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఇందిరా దత్


పార్కింగ్‌లో తమ వాహనాలను వెతుకుతున్న వాహనదారులు

జీజీహెచ్‌లో భద్రత డొల్ల!

- సెక్యూరిటీ వైఫల్యం.. వార్డుల్లో, బయటా చోరీలు

(విజయవాడ, ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా తయారైంది. బైకులు, కార్లు ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అదుపుచేయాల్సిన సెక్యూరిటీ విభాగం పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులు తమ వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్నారు. రోగులను తీసుకువచ్చే అంబులెన్సులు, ఇతర వాహనాలకు ఇబ్బందిగా మారుతోంది. ఇటీవల జీజీహెచ్‌లో వాహనాలు చోరీకి గురవుతుండటంతో భద్రత ప్రశ్నార్థకంగా ఉంది. ఇంత జరుగుతున్నా సెక్యూరిటీ విభాగం పట్టనట్టు వ్యవహరిస్తోందని రోగుల సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో వరుస చోరీల నేపథ్యంలో పోలీసులు పటిష్టంగా ఉండాలని ఆదేశించినా సెక్యూరిటీ విభాగం పెడచెవిన పెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెక్యూరిటీ లోపం కారణంగా ఆసుపత్రిలో రోగులు, సహాయకుల వస్తువులు మాయమవుతున్నాయి. అధికారులే వచ్చినప్పుడు మాత్రమే కనిపించే సెక్యూరిటీ హడావుడి తరువాత ఎక్కడ ఉంటున్నారో తెలియని పరిస్థితి. నిబంధనల ప్రకారం సాయంత్రం ఆరు గంటలు దాటిన తరువాత ప్రధానగేటు, మార్చురీ వైపు గేటు మినహా అన్ని గేట్లు(కాలేజీ గేటు సహా) మూసేయాలి. కొన్ని రోజులు ఈ నిబంధన పాటించినప్పటికీ తర్వాత విస్మరించడంతో అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయి. ఆసుపత్రికి, కాలేజీకి మధ్య ఖాళీ స్థలంలో మందుబాబులు, ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. గంజాయి బ్యాచ్‌లు సంచరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్చురీ వైపు సీసీ కెమెరాలు లేకపోవడం, సెక్యూరిటీ లేకపోవడంతో ఆసుపత్రిలో దొంగతనాలు చేసేవారు సులువుగా బయటకు వెళ్లిపోతున్నారు.


ఆస్పత్రి మెయిన్ గేటు వద్ద నిలిపి ఉంచిన కార్లు


ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు

ఎంఏసీపీఎస్ అమలు చేయండి

- ఎంపీ కేశినేని శివనాథ్‌కు రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ల వినతి

రైల్వేస్టేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఏడో వేతన సంఘం సిఫారసులు అమలులోకి వచ్చిన 1 జూలై 2016 నుంచి మోడిఫైడ్ అష్యూర్డ్ కెరియర్ ప్రోగ్రెషన్ స్కీమ్ (ఎమ్.ఎ.సి.పి.ఎస్)ను అమలు చేయాలని ఆలిండియా రిటైర్డ్ స్టేషన్ మాస్టర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)కు వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ (సౌత్ సెంట్రల్) బైద్యనాథ్ షా ఆధ్వర్యంలో నాయకులు ఎంపీని విజయవాడ గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. మోడిఫైడ్ అష్యూర్డ్ కేరియర్ ప్రోగ్రెషన్ స్కీమ్‌ను 2016 నుంచి కాకుండా 2018 నుంచి ఇంప్లిమెంట్ చేస్తున్నారు. ఇందువల్ల స్టేషన్ మాస్టర్‌లకు నష్టం జరుగుతుందని, 2016 నుంచి ఇంప్లిమెంట్ చేస్తే స్టేషన్ మాస్టర్లతో పాటు రిటైర్డ్ స్టేషన్ మాస్టర్స్‌కు ప్రయోజనకరంగా ఉంటుందని తెలియజేశారు. సమస్యపై ఎంపీ సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. నాయకులు టి.వి.కె.ఎం.చలపతిరావు, ఎం.సాంబిరెడ్డి, కె.వి.ఎ్ స.ఎస్.శాస్త్రి, ఎం.శేషసాయిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎవరివో తేల్చుకుందామా..

- పేర్ని నానికి యార్లగడ్డ సవాల్



మచిలీపట్నం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ హయాంలో ఎవరు ఎక్కువ కేసులు పెట్టారో, టీడీపీ ఏడాది పాలనలో ఎక్కువ కేసులు పెట్టారో తేల్చుకుందామా.. అంటూ మాజీ మంత్రి పేర్నినానికి గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సవాల్ విసిరారు. మచిలీపట్నం ఆర్అండ్‌బీ గెస్టుహౌస్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో యార్లగడ్డ మాట్లాడారు. గన్నవరంలో ఎన్నికల ప్రచారంలో వైసీపీ కార్యకర్తలపై కేసులు పెట్టలేదన్నారు. ఏడాదిగా ఎవరిపై ఏ స్టేషన్‌లోనూ తప్పుడు కేసులు పెట్టలేదన్నారు. పేర్నినానిలా సభ్యసమాజం తలదించుకునే విధంగా అసభ్యకరంగా ఏనాడూ తాను మాట్లాడలేదన్నారు. పేర్నికృష్ణమూర్తి ప్రతిపక్ష నాయకులపై అసభ్యకరంగా మాట్లాడిన సందర్భాలు కూడా లేవన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌లపై అసభ్యంగా మాట్లాడటం పేర్నినానికి తగదన్నారు. పార్లమెంటులో వైసీపీ ఎంపీలు హాజరవుతున్నా.. అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేలు ఎందుకు హాజరుకాలేక పోతున్నారని ప్రశ్నించారు. గుండె చికిత్స చేయించుకున్నట్టు చెబుతున్న ఓ వైసీపీ నేత బెల్టు తీస్తే ఎక్కడ పోలీసులు అరెస్టు చేస్తారోనని భయంతో బెల్టుతోనే నెలల తరబడి తిరుగుతున్నాడన్నారు. పేర్నినాని తన భాష మార్చుకోవాలన్నారు. పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, ఎన్టీరామారావు వంటి ప్రముఖులు జన్మించిన కృష్ణాజిల్లాలో వైసీపీ నాయకులు మాట్లాడే భాష విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బచ్చుల బోసుబాబు తదితరులు మాట్లాడారు.

సమన్యాయం చేయండి

- పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ

గాంధీనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ తీసుకువచ్చిన సీఎం చంద్రబాబు మాదిగలకు 7, మాలలకు 7, ఉప కులాలకు 1శాతం కేటాయించి సమన్యాయం చేసేలా చట్టం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ కోరారు. మూడు దశాబ్దాల మాదిగల మహోద్యమ సన్నాహక సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగింది. అమరావతిలో మాదిగల సంక్షేమ భవనం ఏర్పాటు చేయాలని, బాబూ జగ్జీవన్‌రామ్, గుర్రం జాషువా స్మృతివనం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీవో 46ను రద్దు చేసి మాదిగలకు ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు వేయ్యి కోట్లు కేటాయించి మాదిగల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో మాదిగలకు సామాజిక న్యాయం జరిగేలా చట్టం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కుంటిమద్ది ఓబులేసు, తప్పెట హరిబాబు, సుజన్‌రావు, రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి నాయకులు పాల్గొన్నారు.


సాహిత్య సింధు బిరుదును అందుకుంటున్న జీవీ పూర్ణచంద్

పూర్ణచందుకు 'సాహిత్య సింధు' బిరుదు

విజయవాడ కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేటలో నిర్వహించిన 3 రోజుల విద్వత్ సభలలో నగరానికి చెందిన ప్రసిద్ధ సాహితీవేత్త, పరిశోధకులు, భాషోద్యమ ప్రముఖులు డాక్టర్ జీవీ పూర్ణచంద్‌ని 'సాహితీ సింధు' బిరుదుతో తెలుగు భాషకు తెలుగు సంస్కృతికి వారు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేస్తున్నట్టు పలువురు వక్తలు తెలిపారు. ప్రసిద్ధ పంచాంగ కర్తలు బుర్రా వెంకటేశ్వర శర్మ, బుట్టే వీరభద్ర దైవజ్ఞ, ఇంద్రకంటి ప్రసాదశర్మ సిద్ధాంతి, చల్లా శ్రీనివాసశర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రపతి బహుమతి గ్రహీత పీటీజీవీ రంగాచార్యులు సభను నిర్వహించారు.



ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 16 ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు 16 ట్రిప్పుల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07481 తిరుపతి-చర్లపల్లి ప్రతి ఆదివారం నడుస్తుంది. ఆగస్టు 3 నుంచి 24వ తేదీ వరకు నాలుగు ట్రిప్పులు తిరుగుతుంది. 07482 చర్లపల్లి తిరుపతి ప్రతి సోమవారం నడుస్తుంది. ఆగస్టు 4 నుంచి 25వ తేదీ వరకు నాలుగు ట్రిప్పులు, 06085 ఎర్నాకుళం - పాట్నా ప్రతి శుక్రవారం నడుస్తుంది. ఈ నెల 25 నుంచి ఆగస్టు 15వరకు నాలుగు ట్రిప్పులు, 06086 పాట్నా - ఎర్నాకుళం ప్రతి సోమవారం నడుస్తుంది. ఈ నెల 28 నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు నాలుగు ట్రిప్పులు నడుస్తుంది. తిరుపతి-చర్లపల్లి ప్రత్యేక రైళ్లు రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపర్తి, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల్, వనపర్తి రోడ్డు, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడ స్టేషన్లలో ఆగుతాయి. అన్ని కోచ్‌లలో త్రీ ఏసీ ఉంటుంది. ఎర్నాకుళం-పాట్నా ప్రత్యేక రైళ్లు అలువ, త్రిశూర్, పలక్కాడ్, కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్డు, సేలం, జలార్‌పేట, కాట్పాడి, అరక్కోణం, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, బాపట్ల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, పలాస, సోంపేట, ఇచ్చాపురం, బెర్హంపూర్, బలుగాం, కుర్థారోడ్డు, భువనేశ్వర్, కటక్, జజ్జిపూర్, కియోన్‌జోర్ రోడ్డు, భద్రక్, బాలేశ్వర్, ఖర్గపూర్, అందుల్, దంకుని, బర్ధమాన్, దుర్గాపూర్, అశంసోల్, చిత్తరంజన్, జంతార, మధుపూర్, జసిద్ధి,జాజా, కియోల్, మొఖమా, భక్తియార్‌పూర్, పాట్నాసాహెబ్, రాజేంద్రనగర్ టెర్మినల్ స్టేషన్లలో ఆగుతుంది. ఈ రైళ్లకు టూఏసీ, త్రీఏసీ, స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లు అమర్చి ఉంటాయి.

పోలీసులకు అత్యాధునిక శిక్షణ

(5వ పేజీ తరువాయి)

కూడా శిక్షణ ఇస్తామని మంత్రి అనిత వివరించారు.

రూ.32 కోట్ల వ్యయంతో నిర్మాణం

మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రూ.32 కోట్ల వ్యయంతో 46 ఎకరాల విస్తీర్ణంలో జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రం మచిలీపట్నం నగరానికి మణిహారంగా మారుతుందన్నారు. ఇక్కడ ఎక్సైజ్ శాఖ, మెరైన్ పోలీసులకు కూడా శిక్షణ ఇచ్చే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. త్వరలో పోర్టు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని, తీరప్రాంతంలో గంజాయి, ఇతర మత్తుపదార్థాలు రవాణా జరపకుండా నిఘా పెట్టేందుకు మెరైన్ పోలీసు వ్యవస్థను పటిష్టం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా హోంమంత్రిని కోరారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్, ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, గుడివాడ, పామర్రు ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సత్యనారాయణ, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ సీఈ వేణుగోపాలరాజు, ఎస్ఈ బి.సంజయ్‌సునీల్‌కుమార్, ఈఈ జి.శ్రీనివాసరావు, డీఈఈ వి.వెంకటరెడ్డి, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, బందరు ఆర్డీవో కె.స్వాతి, చినకరగ్రహారం మాజీ సర్పంచ్ నడకుదిటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మ్యాపింగ్‌ను మార్చండి

(5వ పేజీ తరువాయి)

సమన్యాయం జరుగుతుందనేది తమ్ముళ్ల మాట.

కూటమి ప్రభుత్వం వచ్చినా అదే మ్యాపింగా..

ఐదేళ్ల పాటు తాము నష్టపోయామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అదే మ్యాపింగ్ విధానాన్ని అనుసరించటం వల్ల తమతో పాటు, అర్హులంతా నష్టపోతున్నారని టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పథకాల అమలుకు పెట్టిన నిబంధనలు కూడా తూచా తప్పకుండా పాటించటం వల్ల సమస్యలు వస్తున్నాయంటున్నారు.

కంటైనర్‌లో మంటలు.. తప్పిన ప్రమాదం!

విద్యాధరపురం : కనకదుర్గా ఫ్లై ఓవర్ నిర్మాణ సమయంలో హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలో కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన కంటైనర్‌లో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి చర్యలు చేపట్టారు. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి హుటాహుటీన వెళ్లి కంటైనర్‌లో మంటలను ఆర్పివేశారు. ఈ కంటైనర్‌ను కనకదుర్గా ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో సదరు కాంట్రాక్టర్ సోమా కంపెనీ కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసింది. ఆకతాయిలు కంటైనర్‌లో ఉన్న చెత్తకు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	106, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 520

నున్నలో విద్యుత్ అదాలత్ నేడు

విజయవాడ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు నున్న గ్రామంలో శుక్రవారం విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు నున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ శివారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని స్వప్న ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అదాలత్ నిర్వహించనున్నామని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవడంతో పాటు విద్యుత్ వాడకంపై అవగాహన కల్పించుకోవచ్చని తెలియజేశారు.


పెదఓగిరాల పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మున్నంగి శ్రీనివాసరెడ్డి


తెన్నేరు పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న గద్దె నాగేశ్వరరావు


నున్న పీఏసీఎస్‌చైర్మన్ కలకోటి శ్రీనివాసరెడ్డి, డైరక్టర్లు


ఎలుకపాడు సొసైటీ చైర్‌పర్సన్ దేవినేని విజయకుమార్, డైరెక్టర్లు

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం

ఉయ్యూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. గురువారం పెదఓగిరాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చైర్మన్ మున్నంగి శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు ఓదూరి సాంబశివరావు, మార్గాని శివకుమారి చేత ప్రమాణస్వీకారం చేయించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ త్వరలో అన్నదాత సుఖీభవ పథకంద్వారా ఆర్థికసాయం చేస్తుందన్నారు. సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఆకునూరు సర్పంచ్ గోలి వసంతకుమార్, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, సీనియర్ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

పదవి అలంకారం కాదు.... బాధ్యత

కంకిపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) :పదవులు అలంకారం కాదని...బాధ్యత అని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ స్పష్టం చేశారు. మండలంలోని తెన్నేరు గ్రామంలో గురువారం వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘం చైర్మన్‌గా గద్దె నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ పార్టీకి కష్ట పని చేసిన ప్రతి ఒక్కరికీ పదవులు ఇస్తానని హామీ ఇచ్చారు. పదవులు పొందిన వారు పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం తెన్నేరు పీఏసీఎస్ చైర్మన్‌గా గద్దె నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులుగా సూరపనేని మురళీ, కొండవీటి శ్రీనుతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మీ, మాజీ జడ్పీటీసీ గొంది శివరామకృష్ణ ప్రసాద్ టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, యార్లగడ్డ రాజా, తెన్నేరు, మారేడుమాక సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

రూ.100 కోట్ల టర్నోవర్ లక్ష్యం : కలకోటి

విజయవాడ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) వ్యాపార లావాదేవీలను రూ.100 కోట్ల టర్నోవర్‌కు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తామని పీఏసీఎస్ నూతన చైర్మన్ కలకోటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా రూరల్ మండలం నున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం గురువారం జరిగింది. చైర్మన్‌గా కలకోటి శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లుగా పామర్తి శ్రీనివాసరావు, గంపా శ్రీనివాస్ యాదవ్ అధికారికంగా ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ భుక్యా శ్రీనివాసరావు, సత్యనారాయణపురంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు ముగ్గురు సభ్యుల కమిటీకి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కలకోటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సొసైటీని లాభాల బాటలో తీసుకెళ్లడంతో పాటు రైతులకు బహుళ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండలం అధ్యక్షుడు గొడ్డళ్ళ చిన్నరామారావు, నున్న గ్రామ ప్రధాన కార్యదర్శి మాదు శివరామ్‌ప్రసాద్, నేతలు యార్కారెడ్డి కోటిరెడ్డి, వింతా శివారెడ్డి, ఆరేపల్లి ఆంజనేయులు, మాదు శ్రీనివాసరావు, మల్లెల మణికుమార్, తల్లిబోయిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎలుకపాడు సొసైటీ ప్రమాణ స్వీకారం

ఉంగుటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎలుకపాడు, మానికొండ సహకారసంఘాల్లో నూతనంగా నియమితులైన త్రిసభ్యకమిటీల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఎలుకపాడు సొసైటీ చైర్‌పర్సన్‌గా దేవినేని విజయకుమార్, పర్సన్లుగా కొలుసు సత్యనారాయణ, శ్రీకాకుళపు జ్ఞానానందం, మానికొండ సొసైటీ చైర్‌పర్సన్‌గా ఆరికట్ల రవికుమార్, పర్సన్లుగా బడుగు కిషోర్‌బాబు, కొమరవల్లి రాజు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎలుకపాడు టీడీపీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు పొన్నగంటి బాలకృష్ణారావు, బొకినాల నిరీక్షణరావు, నాయకులు, ఉంగుటూరు కేడీసీసీబీ మేనేజర్ పి.షబీర్, మానికొండ గ్రామ ప్రముఖులు చింతా వాసుబాబు, టీడీపీ గ్రామనాయకులు, రైతులు, సొసైటీల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆకునూరు ప్రభుత్వ పాఠశాల వద్ద పైప్‌లైన్ లీకై వృథాగా పోతున్న తాగునీరు

పైప్‌లైన్ లీక్..తాగునీరు వృథా

ఉయ్యూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఆకునూరులో ప్రభుత్వ పాఠశాల వద్ద పైప్‌లైన్ లీకై వారం రోజులుగా తాగునీరు వృథాగా పోతుంది. పాఠశాల సమీపాన సర్వీసు రోడ్డుకు ఆనుకుని భూమిలో ఉన్న పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతూ రోడ్డుపైకి వస్తున్నా పట్టించుకున్న వారు లేరని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీరు వృథా కాకుండా చూడాలని కోరుతున్నారు.


బాలికల హైస్కూల్‌లో విచారణ చేస్తున్న డీవైఈవో కొండా రవికుమార్

జడ్పీ బాలికల హైస్కూల్‌లో డీవైఈవో విచారణ

గన్నవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం గుడివాడ డీవైఈవో కొండా రవికుమార్ విచారణ నిర్వహించారు. పాఠశాలలో బుధవారం ఆహారం కలుషితమై ముగ్గురు బాలికలు అస్వస్థతకు గురయ్యారన్న నేపథ్యంలో విచారించారు. విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులను ఆయన వేర్వేరుగా సమావేశమై వివరాలు సేకరించారు. ఒక విద్యార్థిని అనారోగ్య సమస్యతో, మరో ఇద్దరు అధిక ఉష్ణోగ్రతల కారణంగా డీహైడ్రేషన్‌కు గురై కళ్లు తిరిగి పడినట్లు చెప్పారు. తమ పిల్లల అస్వస్థతకు కలుషిత ఆహారం కాదని స్పష్టం చేశారు. ఇదే విషయం ఆస్పత్రిలో రిపోర్టులో కూడా వెల్లడైందన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల వివరణను లిఖితపూర్వకంగా తీసుకున్న డీవైఈవో కొండా రవికుమార్ ఉన్నతాధికారులకు నివేదికను అందజేయనున్నట్లు తెలిపారు. ఎంఈవో-2 ఎం. కమల పాల్గొన్నారు.


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి శైలజ

గంగూరు, తాడిగడపల్లో పొలం పిలుస్తోంది

పెనమలూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగూరు, తాడిగడప గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో శైలజ వరి పంటలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఖరీఫ్2025 సంవత్సరానికి కృష్ణా జిల్లాలో రైతులు వరి పంటకు ఎకరానికి రూ.830, పసుపు పంటకు ఎకరానికి రూ.1100 చొప్పున ప్రీమియం వాటాగా చెల్లించాలని తెలిపారు. వరి పంట నమోదును ఆగస్టు 15లోగా, పసుపు పంట నమోదును ఈనెల 31లోగా చేసుకొని రైతు సేవా కేంద్రం, కామన్ సర్వీస్ సెంటర్ లేదా సచివాలయంలో ప్రీమియం చెల్లించవచ్చని తెలిపారు. వ్యవసాయ సహాయకులు జమీలా అంజుం, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన కార్మెల్ మాత మహోత్సవాలు

కానూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కానూరులోని కార్మెల్ మాత మహోత్సవాలు ఫాదర్ సలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈనెల 7న నవదిన ప్రార్థనలతో ప్రారంభమైన ఈమహోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. కానూరులోని చర్చి ఆవరణలో జరిగిన కార్మెల్ మాత మహోత్సవ సమష్టి దివ్యబలి పూజను వికార్ ప్రొవెన్షియల్ ఫాదర్ కెవిన్ ఆంతోని నిర్వహించారు.

ఫాదర్లు సలివేంద్ర శౌరి, సహాయ గురువులు మైత్రి దేవదానం, డైరెక్టర్ అబ్బదసరి రత్నరాజు పాల్గొని భక్తులకు దివ్యసత్ప్రసాదం అందించారు.

ఈ సందర్భంగా 40 మంది పిల్లలకు నూతనంగా దివ్యసత్ప్రసాదం అందజేశారు. 30 మంది నూతన వధూవరులకు జ్ఞానస్నానం ఇచ్చారు. టెన్త్, ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు.


కంకిపాడు బచ్చుపేటలో కరపత్రాలు అందజేస్తున్న పులి శ్రీనివాసరావు తదితరులు


ఆరుగొలనులో కరపత్రాలు అందజేస్తున్న బేతా శేషుకుమార్, కళ్లం సుదర్శనం తదితరులు


ముదునూరులో ఇంటింటా కరపత్రాలు అందజేస్తున్న జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చౌదరి, మాజీ సర్పంచ్ జ్ఞానశేఖర్

సుపరిపాలన అందించడమే లక్ష్యం

పెనమలూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అందించడమే టీడీపీ కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు శొంఠి శివరాంప్రసాద్, మొక్కపాటి శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. గురువారం యనమలకుదురు గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు ప్రభుత్వం తరఫున అమలు చేస్తున్న పథకాలను వివరించే కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు తాడిశెట్టి వీరాస్వామి, బుక్యరాజా, ఆంజనేయులు, సంపర శేఖర్, కందుల శివరాం, శేషు, కొక్కిలిగడ్డ సంగీతరావు, ధనేకుల షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరులో...

పెనమలూరు అజయ్‌నగర్ కాలనీలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, క్లస్టరు ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరరావులు స్థానికులకు టీడీపీ నాయకులతో కలిసి ఏడాది పాలనలో సాధించిన విజయాలను వివరించే కరపత్రాలను పంచిపెట్టారు.

కానూరులో సుపరిపాలన తొలి అడుగు

కానూరు: తాడిగడప మున్సిపాలిటీ కానూరు గ్రామంలో గురువారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ టీడీపీ శ్రేణులతో కలిసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బోడె వివరించారు.

రోడ్డు, డ్రెయినేజీకి ప్రారంభోత్సవం

కానూరు పిన్నమనేని టీచర్స్ కాలనీలోని స్వర్ణ హైట్స్ అపార్టుమెంట్ నుంచి పంటకాలువ రోడ్డు వరకు నిర్మించిన రోడ్డు, డ్రెయినేజీకి గురువారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ గురువారం ఉయ్యూరు 16వ వార్డులో పర్యటించి కూటమి ప్రభుత్వం అమ లు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఇంటింటా ప్రచారం చేశారు. ఉయ్యూరు చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, సుబ్బారావు, అజ్మతులా తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కానూరులో సుపరిపాలన తొల అడుగులో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

ముదునూరులో ..

తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, మాజీ సర్పంచ్ మొవ్వ జ్ఞానశేఖర్ ఆధ్వర్యంలో ముదునూరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రచారం చేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు పామర్తి నాగరాజు, పల్లపోతు శ్రీనివాసరావు, రామకోటయ్య, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడులోని బచ్చుపేటలో గురువారం నిర్వహించిన సుపరిపాలనలతో తొలి అడుగు కార్యక్రమంలో క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి కొండా నాగేశ్వరరావు, తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఆరుగొలను గ్రామంలో టీడీపీ అధ్యక్షుడు బేతా శేషుకుమార్ మహిళలకు కరపత్రాలు పంపిణీ చేశారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలను వివరించారు. ఉపాధ్యక్షుడు కళ్లం సుదర్శనం, అన్నే అనిల్‌కుమార్, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

నందమూరు నుంచి దుర్గమ్మకు ఆషాఢ సారె



ఉంగుటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గోవిందనామ ప్రచార సేవాసంఘం-సేవాభారతి ఆధ్వర్యంలో మండలంలోని నందమూరుకు చెందిన మహిళా భక్త బృందం విజయవాడ కనకదుర్గ అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. మహిళా భక్తులందరూ గురువారం ఉదయం స్థానిక శ్రీకోదండ రామాలయం నుంచి పసుపు, కుంకుమ, గాజులు, పట్టుచీరలు, పూలు, పండ్లు, వివిధ రకాల పిండివంటలు, పొంగళ్లతో వెళ్లి దుర్గమ్మను దర్శించి సారె సమర్పించారు. ఈ సందర్భంగా గోవిందనామ ప్రచార సేవాసంఘం-సేవాభారతి గన్నవరం ఖండ సేవా ప్రముఖ్ యడవల్లి పాండురంగారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో అమ్మవార్లకు ఆషాఢసారెను ఆనవాయితీగా ఇవ్వడం జరుగుతోందన్నారు. గ్రామ మహిళా కన్వీనర్ సూరమ్మ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

పెనమలూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కాల్వలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశార యనమలకుదురు భగత్ సింగ్‌నగర్‌కు చెందిన అంబటి కుమారి (57)గత కొంతకాలంగా రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతోంది. గుండె జబ్బు కారణంగా ఆమెకు కీమోతెరపీ చేయలేదు దీంతో బాధ ఎక్కువై భరించలేక మంగళవారం యనమలకుదురు లాకుల వద్ద కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెగా రుణమేళా

కానూరు, జూలై17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సర్కిల్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెగా రిటైల్ లోన్ మేళా గురువారం పోరంకిలో జరిగింది. బ్యాంక్ జనరల్ మేనేజర్ వి.నీలిమ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ పంజాబ్ నేషనల్ బ్యాంక్ అతి తక్కువ వడ్డీ రేట్లకే గృహ, వాహన, ఆస్తి తనఖా, విద్య, బంగారు ఆభరణాల రుణా లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌లు రామనాథం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుణాలు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.

ఎస్‌ఆర్‌కేలో పీజీఆర్‌ఎస్ రేపు

పెనమలూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఈ నెల 19న సాయంత్రం 4 గంటలకు ఎనికేపాడులోని ఎస్‌ఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాలలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నారు. నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, నిడమానూరు, గూడవల్లి ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు

పెనమలూరు, జూలై17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. .కంకిపాడు గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి కుంభ లక్ష్మీనారాయణ బంధువుల అంత్యక్రియలకు హాజరు కావడానికి 14న రాత్రి ఇంటి నుంచి బయలుదేరి తన పోరంకి క్యాపిటల్ ఆసుపత్రి వద్ద కారు ఆపి రోడ్డు దాటుతుండగా బందరు వైపు వెళుతున్న మోటారుసైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.





వర్షాతిరేకం

మండే ఎండల్ని చీల్చి చెండాడుతూ నీలిమేఘాలు ఆకాశాన్ని కమ్ముకున్నాయి.. రోజంతా ఎండ తాకిడికి, ఉక్కపోతకు గురైన నగర ప్రజలు ఉపశమనం కోసం ఆకాశం వైపు చూడగా ఉరిమే మేఘాల నుంచి వర్షపు చినుకులు భూమిపై జాలువారాయి. దీంతో చల్లదనం కోసం వేచి ఉన్న నగర ప్రజలు వర్షం పడిన ఆసాంతం చల్లదనాన్ని ఆస్వాదిస్తూ సేదతీరారు.









సాగు సాగేనా..!

- జీవం కోల్పోతున్న మాగాణి
- కునారిల్లుతున్న మెట్ట పంటలు
- వైర్లు, మోటార్లు దొంగల పాలు
- పనిచేయని ఎత్తిపోతల పథకాలు
- వృథాగా పోతున్న పట్టిసీమ నీరు
- చుక్కనీరు మునేరు, కట్టలేరు, వాగులు







ఆత్కూరు గ్రామంలో నీరు లేని పంట చెరువు, హెచ్ ముత్యాలంపాడు వద్ద నిరుపయోగంగా పంపింగ్ స్కీమ్, నిలువునా ఎండుతున్న మొక్కజొన్న

నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో జూన్, జూలై 16న వరకు పడిన వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో) ఇలా ఉన్నాయి.

మండలం పేరు	జూన్		జూలై నెల	
	సగటు	కురిసింది	సగటు	కురిసింది
వత్సవాయి	104.6	128.0	116.7	30.3
జగ్గయ్యపేట	100.1	107.7	111.6	34.3
పెనుగంచిప్రోలు	97.4	91.5	124.3	21.6
నందిగామ	102.8	91.3	108.3	19.3
వీరులపాడు	116.2	84.2	131.8	33.0
కంచికచర్ల	96.7	79.6	118.0	9.9
చందర్లపాడు	103.0	64.1	117.8	25.7

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం/కంచికచర్ల: ఎన్టీఆర్ జిల్లాలో ఆషాఢంలో రోహిణి కార్తెను తలపించేలా ఎండలు, వర్షాభావం కారణంగా పత్తి, ఇతర మెట్ట పంటలు జీవం కోల్పోతున్నాయి. జూన్, జూలై నెలల్లో అడపాదడపా కురిసిన వర్షాలతో పత్తి మొక్కలు కొంత ఎదిగినప్పటికీ, తర్వాత వర్షం లేక ఎదుగుదల లోపించింది. మాగాణి సాగు కూడా సవ్యంగా సాగడం లేదు. వాగులు, చెరువుల్లో నీరు లేక, బోర్లపై ఆధారపడిన రైతులు నారుమడులు పోస్తున్నారు. 2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి నీరు పుష్కలంగా వస్తున్నప్పటికీ, 2019-2024 మధ్య వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పంపింగ్ స్కీమ్‌లు నిరుపయోగంగా మారాయి. మోటార్లు, వైర్లు దొంగిలించబడడంతో చెరువులకు నీటిని మళ్లించలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు తక్షణం మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. వర్షాభావం వల్ల మెట్ట ప్రాంతం లో పంటలు దెబ్బతిన్నాయి. తొలకరిలో సాగైన పైర్లు ఎదుగుదల లోపించి, గిడసబారుతున్నాయి. కృష్ణానది, మునేరు, కట్టలేరు వంటి నీటి వనరుల్లో నీరు లేదు. ఎండలు, వడగాడ్పులతో వాతావరణం వేసవిని తలపిస్తోంది. పత్తి, మొక్కజొన్న, పెసర, మినుము పంటలు ఆశాజనకంగా లేవు. పల్లాకు తెగులు సోకడంతో పైర్లు పసుపు పచ్చగా మారుతున్నాయి. జూలై సగం దాటినా వర్షాలు లేక, వ్యవసాయ కూలీలు ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురవుతున్నారు. నీటి వనరులు ఎండిపోవడంతో తాగునీటికి, పశువులకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.



గిడసబారి నేల చూస్తున్న పత్తి మొక్కలు



ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్టీసీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

జాయింట్ మీటింగ్‌లను పునరుద్ధరించండి

- ఆర్టీసీ ఎండీకి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ నేతల వినతి

బస్టేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్పొరేషన్‌గా ఉన్నప్పుడు 47శాతం పైగా బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన గ్రీవెన్స్ జాయింట్ మీటింగ్‌లను పునరుద్ధరించాలని ప్రజా రవాణా సంస్థ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు నేతృత్వంలో గురువారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. గత విధానాన్ని అమలు చేయకపోవటంతో గ్రీవెన్స్ మీటింగ్‌లు నిలిపేశారని ఎండీ ద్వారకా తిరుమలరావు నేతలకు తెలిపారు. ఈ విజ్ఞప్తిని ప్రభుత్వానికి పంపుతామని, వారి ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఎస్వీ రావు, శేఖర్‌బాబు, ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, అసోసియేషన్ నేతలు కే ఎం లక్ష్మణుడు, వీ జే రత్నం, వీ జానకిరామ్, పీ సూరిబాబు, పీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు గడువు పొడిగింపు

వన్‌టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం జూలై 2025 సెషన్‌కు ఆన్‌లైన్‌లో పోస్టు గ్రాడ్యుయేట్, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రాంకు దరఖాస్తులు స్వీకరణ జూలై 31 వరకు పొడిగించినట్టు విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కే సుమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ 2వ సంవత్సరం, డిగ్రీ 2, 3వ సంవత్సరం చదివే విద్యార్థులు కూడా రీరిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్‌లో జూలై 31 వరకు పొడిగించినట్టు తెలిపారు. వివరాలకు కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గానీ, లేదా 0866-2565253 ఫోన్‌లోగానీ సంప్రదించవచ్చన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో హార్ట్ సర్జరీలకు బ్రేక్

- వైద్యుల కొరతతో ఆగిన బైపాస్ సర్జరీలు
- ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాలని సూచిస్తున్న వైద్యులు

విజయవాడ/ప్రభుత్వాసుపత్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగంలో బైపాస్ సర్జరీలు నిలిపివేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆసుపత్రిలో రోగుల తాకిడి ఎక్కువవడం, వైద్యుల కొరతతో సర్జరీలు చేయడం కష్టంగా ఉందని వారు వెల్లడించారు. ఈ విభాగంలో ఒక ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. కొన్నాళ్లుగా జీజీహెచ్‌లో గుండెకు సంబంధించిన బైపాస్ సర్జరీలు చేయడానికి గుంటూరు నుంచి సపోర్టింగ్ స్టాఫ్‌గా వైద్యులు వచ్చేవారు. ప్రస్తుతం బదిలీల నేపథ్యంలో రావడానికి కుదరడం లేదు. ఉన్న ఇద్దరితో బైపాస్ సర్జరీలు చేయడం కష్టం. దీంతో స్టంట్‌లు మాత్రమే వేస్తామని, బైపాస్ సర్జరీకు వచ్చే రోగులు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలంటూ వైద్యులే సూచిస్తున్నారు. ఈ కారణంతో వివిధ ప్రాంతాల నుంచి, వ్యయప్రయాసలకు ఓర్చి ఆసుపత్రికి వస్తున్న రోగులకు తిప్పలు తప్పడం లేదు. అధిక శాతం మంది పేదలే వస్తారు. ఉన్నపళంగా ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోమంటే తమకు తలకుమించిన భారం అవుతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినట్టు జీజీహెచ్ అధికారులు తెలిపారు.

హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్న జగన్

- శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యువతను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రత్యక్షంగా రెచ్చగొడుతూ హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని శాప్ చైర్మన్ రవినాయుడు మండిపడ్డారు. స్టేడియంలోని శాప్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎంగా పనిచేసిన వ్యక్తి యువత భవిష్యత్తును హత్యా రాజకీయాల వైపు మళ్లించడం సిగ్గుచేటన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి సారథ్యంలోనే ఇదంతా నడుస్తుందన్నారు. జగన్‌రెడ్డి ఎక్కడ పర్యటన హడావుడి, బెదిరింపులే తప్ప అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడిన సందర్భాలు లేవన్నారు. రాష్ట్రంలో కూటమి రాకతో పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయని, సీఎం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు,

స్పెషల్ చీఫ్ సెక్రటరీని కలిసిన శాప్ చైర్మన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అజయ్‌జైన్‌ను శాప్ చైర్మన్ రవినాయుడు గురువారం ఆటోనగర్‌లోని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రీడాభివృద్ధిపై చర్చించడంతో పాటు వాటి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

తీవ్రగాయాలతో యువతి ఆసుపత్రిపాలు





మృతి చెందిన పవన్, చికిత్స పొందుతున్న భాగ్యలక్ష్మి

గన్నవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీబీగూడెం సమీపంలో బైపాస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో యువకుడు పవన్ (22) మృతి చెందగా, యువతి గరికపాటి భాగ్యలక్ష్మి (21) తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొం టదుతోంది. ఇబ్రహీంపట్నంకు చెందిన భాగ్యలక్ష్మి, చిన అవుటపల్లి సిద్ధార్థ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేసి, పిన్నమనేని మెడికల్ కళాశాలలో ట్రైనీ నర్సుగా చేరింది. బుధవారం రాత్రి సబ్బుల కోసం హాస్టల్ నుంచి పవన్ ద్విచక్ర వాహనంపై బయటకు వచ్చారు. విజయవాడ వైపు వెళ్తుండగా, బీబీగూడెం వద్ద ప్రమాదం జరిగింది. పవన్ అక్కడికక్కడే మృతి చెందగా, భాగ్యలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. రూమ్‌మేట్ ఫోన్ చేయగా, ద్విచక్ర వాహనదారుడు విషయం తెలిపాడు. 108 అంబులెన్స్‌లో ఇద్దరినీ పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు. పవన్, ఏలూరు జిల్లా ఈదులగూడెం గ్రామానికి చెందినవాడు. విజయవాడలో ప్రైవేటు సర్వేయర్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసేవాడు. ప్రమాద కారణంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జగ్గయ్యపేట, నందిగామ ఏఎంసీ చైర్ పర్సన్‌లుగా కొఠారు, పిట్టల

- సీనియర్ నేతకు అవకాశం

జగ్గయ్యపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్‌గా జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామానికి చెందిన సీనియర్ నేత తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు సత్యనారాయణ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అనేక పదవులను కొఠారు నిర్వహించారు. 1997లో తెలుగు యువత మండలాధ్యక్షుడిగా, 2002లో టీడీపీ గండ్రాయి గ్రామ అధ్యక్షుడిగా, 2004లో టీడీపీ మండలాధ్యక్షుడిగా, 2009 నుంచి జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా పదేళ్లు, 2014లో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్తగా, 2020 నుంచి రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధిగా పనిచేశారు. పార్టీ క్లిష్టకాలంలోనూ నిజాయితీగా పనిచేశారు. రైతు నేతగా ఉన్న కొఠారు గతంలోను ఏఎంసీ చైర్మన్ పదవీ కోసం ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఈ దఫా ఆయన్ను అదృష్టం వరించింది. నియోజకవర్గ టీడీపీతో పాటు ఎంపీ ఆశీస్సులు అందుకున్నారు. తనకు పదవీ రావటానికి కృషి చేసిన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, ఎంపీ కేశినేని శివనాథ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ నేతకు వరించిన పదవి

నందిగామ: నందిగామ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా పిట్టల శ్రీదేవిని ఖరారు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పొత్తులో భాగంగా బీజేపీకి చెందిన శ్రీదేవికి ఈ పదవిని కేటాయించారు. కంచికచర్ల పట్టణానికి చెందిన పిట్టల శ్రీదేవి కొద్దికాలంగా బీజేపీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. నందిగామ, చందర్లపాడు మండలాల నుంచి ఈ పదవి కోసం పెద్ద ఎత్తున ఆశావహులు పోటీ పడుతుండగా అనూహ్యంగా ఆమె పేరును ప్రభుత్వం ప్రకటించడంతో బీజేపీతో సహా కూటమి పార్టీల నేతలు విస్మయం చెందారు. బీసీ మహిళకు కేటాయించిన ఈ పదవిని బీజేపీకి కేటాయించడంతో ఆ పార్టీ జిల్లా, రాష్ట్రస్థాయి నేతలు ఆమె పేరును ప్రతిపాదించారు. దీంతో ప్రభుత్వం ఆమె పేరును ఖరారు చేసింది. తన నియామకానికి సహకరించిన బీజేపీ నేతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.







వ్యక్తిగత కార్యదర్శి పాడె మోసిన వసంత

గుండెపోటుతో నరసింహారావు మృతి ● కన్నీటి పర్యంతమైన ఎమ్మెల్యే

కంచికచర్ల రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తన వ్యక్తిగత కార్యదర్శి, గొల్లపూడి పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి కట్టా నరసింహారావు పార్థివ దేహాన్ని చూసిన మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కన్నీటి పర్యంతం అయ్యారు. ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకోలేకపోయారు. నరసింహారావు గురువారం గుండెపోటుతో కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో హైదరాబాద్ నుంచి హుటాహుటిన నరసింహారావు స్వగ్రామం నక్కలంపేట వచ్చి ఆయన పార్థివ దేహాన్ని చూసి చలించిపోయారు. వసంతతో పాటు ఆయన తండ్రి, మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు, ధీమంత్ సాయిలు నరసింహారావు పార్థివ దేహానికి ఘనంగా నివాళులర్పించారు. నరసింహారావు మృతి తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. సాయంత్రం జరిగిన నరసింహారావు అంత్యక్రియల్లో పాల్గొని వసంత పాడె మోశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంపాల సీతారామయ్యతో పాటు కూటమి నేతలు నరసింహారావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అదనపు కట్నం కోసం ఆర్ఎస్ఐ వేధింపులు

● పోలీసు కేసు నమోదు ● వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారుడే ఆర్ఎస్ఐ

జగ్గయ్యపేట రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కూతురు కాపురం చక్కదిద్దేందుకు వచ్చిన బంధువులపై దాడి చేసి గాయపరిచిన ఘటనపై పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన చప్పిడి వెంకట్రామయ్య తన కుమార్తె రాజ్యలతను వేదాద్రికి చెందిన చల్లా వైకుంఠరావు రెండో కుమారునికిచ్చి 14 నెలల క్రితం జగ్గయ్యపేటలో వివాహం చేశామన్నారు. అయితే 6 నెలలుగా అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో సర్దిచెప్పి సమస్య పరిష్కరించేందుకు పెద్ద మనుషుల సమక్షంలో ఇరు కుటుంబాల సభ్యులు చిల్లకల్లు పాలశీతల కేంద్రం సమీపంలోని ప్రైవేట్ ఫంక్షన్ మాల్‌లో చర్చలు జరుపుతున్నారు. ఈ సందర్భంగా వియ్యంకుడి కుటుంబ సభ్యులు తమపై దాడి చేశారని వెంకట్రామయ్య తెలిపారు. ఈ దాడిలో భార్య రమాదేవి, కుమారుడు రాజేంద్ర, బావమరదులు సత్యశేఖర్, రత్నశేఖర్‌కు గాయాలయ్యాయన్నారు. వెంకట్రామయ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేయటంతో పాటు వరకట్నం కోసం భార్యను వేధిస్తున్న మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చల్లా వైకుంఠరావు తన కుటుంబ సభ్యులపై దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదుపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ప్రేమికుల మధ్య మనస్పర్థలు.. గడ్డిమందు తాగి యువకుడి మృతి

గన్నవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయితో మనస్పర్థలు రావడంతో గడ్డిమందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సామర్లకోటకు చెందిన చనపాల శ్రావణ్‌కుమార్ (20) మూడేళ్లుగా గన్నవరంలోని హెచ్‌సీఎల్‌లో పని చేస్తున్నాడు. రెండేళ్లుగా ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. కొద్ది రోజుల నుంచి మనస్పర్థలు రావటంతో ఈ నెల 14న రూముకు వెళుతూ గడ్డిమందు తీసుకువెళ్లి తాగాడు. రూముకు వెళ్లగానే పడిపోవటంతో స్నేహితులకు అనుమానం వచ్చి విజయవాడ ప్రభుత్వస్పత్రికి తరలించారు. గడ్డిమందు ఎక్కువగా తాగడంతో శరీరమంతా వ్యాపించి బుధవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అమరావతివాసులకు సీఆర్‌డీఏ అవగాహన సదస్సులు

కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో అమలవుతున్న పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలు గురించి ఈనెల 15 నుంచి 17 వరకు వరుసగా 3 రోజుల పాటు సీఆర్‌డీఏ అమరావతి వాసులకు అవగాహన సమావేశాలు నిర్వహించింది. అమరావతిలోని ప్రధాన ప్రాంతాల్లో 3 రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల్లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఆర్‌డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సామాజిక సంక్షేమ విభాగం, సామాజిక పర్యావరణ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ సమావేశాలు జరిగాయి. రాజధానిలో భద్రతా నిబంధనలు, పర్యావరణ పరిరక్షణ, మహిళా కార్మికుల సంక్షేమం, వలస కార్మికుల భద్రతకు చేపట్టిన చర్యలను సీఆర్‌డీఏ అధికారులు వివరించారు. సమావేశాలకు హాజరైన వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. గ్రామస్థుల సందేహాలకు అధికారులు సమాధానమిచ్చారు. రాజధాని పనుల కారణంగా ఎలాంటి అసౌకర్యం కలిగినా గ్రామంలోని సీఆర్‌డీఏ ఫెసిలిటేటర్‌కు సమాచారం అందించాలని అధికారులు కోరారు. రాజధానిలో తిరుగుతున్న భారీ వాహనాలతో దుమ్ము ఎగరకుండా నీళ్లు చల్లాలని, సీడ్ యాక్సిస్ రహదారిపై అతివేగంగా వాహనాలు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. చర్యలు తీసుకొంటామని అధికారులు తెలిపారు. రాజధాని నిర్మాణ పనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలంటూ చేసిన విజ్ఞప్తులను పరిశీలిస్తామన్నారు. యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకు జాబ్‌మేళాలు, నైపుణ్య శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు.



సీఆర్‌డీఏ అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న రాజధాని రైతులు

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే మండలి

నాగాయలంక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దివి ఏఎంసీ పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. మార్కెట్ యార్డులో ఏఎంసీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. చైర్మన్‌గా టీడీపీ నేత కొల్లూరు వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా రాజనాల వీరబాబు, డైరెక్టర్లుగా జరుగు ఆదినారాయణ, కారాని సరస్వతి, కొక్కిలిగడ్డ లక్ష్మీ కుమారి, మంగళగిరి శ్రీనివాసరావు, మాతంగి వెంకటేశ్వరమ్మ, పిల్లి మల్లేశ్వరి, పిరాటి శిరీష, పుప్పాల ఏసు, షేక్ పర్వీనా, తలశిల లలిత, మెరకనపల్లి నరేష్‌బాబు, ఉప్పల శివ రాఘవ వర ప్రసాద్, విశ్వనాథపల్లి సోమేశ్వరరావు చేత నాగాయలంక మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత కార్యాలయంలో నూతన పాలకవర్గంతో మార్కెట్ యార్డు ఏడీ ఎల్ దేవానందం, కార్యదర్శి ఎం శ్రీనివాసరావు సంతకం చేయించారు. నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ఐక్యతతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా విజయాలు సాధించాలని నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మండలి వెంకట్రామ్, తుమ్మల చౌదరిబాబు, బొబ్బా గోవర్ధన్ చిలకలపూడి పాపారావు, జీవీ నగరాయులు, తోట కనకదుర్గ, దేవనబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఆరు మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. నూతన పాలకవర్గాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు.



దివి ఏఎంసీ పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	106, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడిగుడ్ల ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 520	



పన్ను బకాయిలను వసూలు చేయాలి

గుడివాడ, జూలై 17(ఆంధ్రజ్యోతి) : గుడివాడ పురపాలక సంఘ పరిధిలో పన్నుల సవరణలు చేసి, పాత బకాయిలను వెంటనే వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమావేశ మందిరంలో అస్సెస్డ్, నాన్ అస్సెస్డ్ పన్ను విధింపు, ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి చార్జీల వసూళ్లపై రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

శ్మశాన వాటిక అభివృద్ధి పనులు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు శివారు అంబేడ్కర్ నగర్ శ్మశాన వాటికలో గురువారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు. సర్పంచ్ పెనుముత్స రాధిక చొరవతో ఈ పనులు నిర్వహిస్తున్నారని గుమస్తా సునీల్ తెలిపారు.



హోంమంత్రి అనితతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

టిడ్కో, ఎన్టీఆర్ కాలనీలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి

గుడివాడ, జూలై 17(ఆంధ్రజ్యోతి) : గుడివాడలోని టిడ్కో కాలనీ, ఎన్టీఆర్ కాలనీలలో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. గురువారం జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ శిక్షణా కేంద్రం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన హోంమంత్రి అనితను ఎమ్మెల్యే వెనిగండ్ల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కాలనీ, టిడ్కో కాలనీల్లో ప్రస్తుతం నివాసముంటున్న కుటుంబాలు, రానున్న రోజుల్లో పెరగనున్న కుటుంబాల నిష్పత్తి వివరాలను హోంమంత్రికి వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటుచేయాలని హోంమంత్రి అనితను ఎమ్మెల్యే వెనిగండ్ల కోరారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కలిగి ఉండాలి

గుడ్లవల్లేరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించే క్లాప్ మిత్రలు తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ఎండి ఇమ్రాన్ పేర్కొన్నారు. విన్నకోట పంచాయతీ పరిధిలోని పలు కార్యక్రమాల్లో ఆయన గురువారం పాల్గొన్నారు. తాగునీటి టాంకుల్లో క్లోరినేషన్ పనులను పరిశీలించారు. క్లాప్ మిత్రలకు వందనం కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు నమస్కారంచేసి వారిని గౌరవించారు.

పేదల సంక్షేమమే కూటమి లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



నందివాడలో..

నందివాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం మండలంలోని జనార్థనపురం, చేదుర్తిపాడు, ఒద్దులమెరక గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అంచెలంచెలుగా పూర్తి చేస్తుందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అథోగతి అయిన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. గ్రామస్థులతో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేదుర్తిపాడు, ఒద్దుల మెరక గ్రామస్థులు తమ గ్రామాలకు ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. గ్రామస్థులకు రోడ్లు వేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి, మండల టీడీపీ అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, అంజిరెడ్డి, రాఘవరెడ్డి, బాబీ, మణికంఠ బ్రదర్స్, దావీదు, సురేష్, రమేష్, రాకేష్, నరేష్, పాల్గొన్నారు.



పామర్రులో..

పామర్రు: ప్రజసంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పలువురు పామర్రు టీడీపీ పట్టణ నేత వీరంకి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 19వార్డులోగల బాపూజీపేట, గౌడపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ఎమ్మెల్యే వర్ల కూమార్‌రాజా ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలందించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ నేతలు, పరస సుబ్రమణ్యం, వార్డు సభ్యుడు మంతెన రామంజనేయులు, వీరంకి మోహనరావు పాల్గొన్నారు.

పెదపారుపూడి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సుపరిపాలనకు తొలి అడుగులో భాగంగా మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో బీసీ పరిధిలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఇంటింటికి వెళ్లి మ కూటమి ప్రభుత్వం అందించే పథకాలు తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా, దీపం పథకాలు అందుతున్నాయా? లేని అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించటానికి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. ఆగస్టు 15వ తే దీ నుంచి రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులలో ప్రతి మహిళకూ ఉచిత బస్సు ప్రయాణానికి శ్రీకారం చుట్టబోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుబ్బయ్య, మాజీ సర్పంచ్ రవికుమార్ పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు : ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో తోట్లవల్లూరు ప్రజలు లో వోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడితే తాము అధికారంలోకి వచ్చిన 12 నెలల్లోనే రూ 25.62 లక్షలతో మూడు ప్రాంతాల్లో త్రీ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌లు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. తోట్లవల్లూరు లైన్ బజారులో పీఏసీఎస్ వద్ద నిర్మించిన త్రీ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే ప్రారంభించారు. బీసీ సెంటర్, రజకపేట వద్ద కూడా త్రీ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌లు నిర్మించామని, ఈ మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లతో 700 కుటుంబాలకు లో వోల్టేజ్ సమస్య తీరిందని వివరించారు. తమది జవాబుదారితనం గల ప్రభుత్వమని నిరూపించామన్నారు. మండల విద్యుత్ ఏఈ దేవదాసు, వెంకట గురుమూర్తి, శివరామ్, గోపయ్య, మురళీ, మోహన్ మంజూ తదితరులు పాల్గొన్నారు.



పెదపారుపూడిలో..

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ చేరాలి

తోట్లవల్లూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలందరికి చేర్చటమే లక్ష్యంగా పని చేయాలని, లోపాలుంటే తమ దృష్టికి తీసుకు రావచ్చని కేంద్ర బృందం సభ్యులు అధికారులకు స్పష్టం చేశారు. తోట్లవల్లూరు మండలం బొడ్డపాడులో గురువారం కేంద్ర బృందం సభ్యులు ప్రభాస్‌వర్మ, నందు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరి హరనాథ్ తదితరులు పర్యటించారు. పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో చేపట్టిన పనులను, డ్వాక్రా సంఘాలకు అందిస్తున్న రుణాల వివరాలను, సామాజిక పింఛన్ల అమలు తీరుని సమీక్షించారు. ఆయా శాఖల అధికారులతో, ప్రజలతోను విడివిడిగా చర్చించారు. సర్పంచ్ మూడే శివశంకర్ సదరు అధికారులను కలిసి పలు అంశాలను వివరించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలతో బహిరంగ సమావేశం నిర్వహించి కేంద్ర ప్రభుత్వం పథకాలు అందకుండా, లోపాలున్నా వెల్లడించాలని కోరారు. సర్పంచ్ శివశంకర్‌కు ప్రజలు సమస్యలను వివరించగా ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని చెప్పారు. సమీక్షల అనంతరం కేంద్ర బృందం అధికారులు ఫీల్డు విజిట్ చేశారు. ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామంలో కూలీలతో తవ్వించిన పంటబోదెలను అధికారులు స్వయంగా పరిశీలించారు. పనులెలా జరిగాయో ఫోన్‌లో చిత్రీకరించారు. ఉపాధిహామీ టీఏ విజయభాస్కరరెడ్డి పనుల వివరాలను తెలియజేశారు. ఎంపీడీవో రవికాంత్, ఎంఈవో-1 జి వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు, పీఆర్ ఏఈ శరాబందిరాజు, రమాదేవి పాల్గొన్నారు.



బొడ్డపాడులో కేంద్ర బృందం సభ్యులు

రైతు సంక్షేమాభివృద్ధికి కృషి చేయాలి

● వింజుమూరి కృష్ణకాంత్

పామర్రు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతన్నలకు అందించే సంక్షేమ పథకాలను సత్వరమే గ్రామాల్లో రైతులకు అందించటంతో పాటు, వారికి అండగా నిలుస్తూ సొసైటీల బలోపేతానికి కొత్తగా ఎంపికైన పీఏసీఎస్ త్రీమెన్ కమిటీలు సేవలందించాలని గుడివాడ కో ఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ వింజుమూరి కృష్ణకాంత్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక సహకార సొసైటీ పాలకవర్గాలను ప్రభుత్వం రద్దు చేయడంతో పాటు వాటి స్థానంలో పర్సన్ ఇన్‌ఛార్జీల పాలనను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. దీంతో ప్రభుత్వం డివిజన్ పరిధిలో ప్రస్తుతం తొలివిడతగా 48 వ్యవసాయ ప్రాథమిక సంఘాలకు త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ఆదేశాలు జేశారు. పామర్రు పరిధిలోని 10 సంఘాలకుగాను ఆరు సొసైటీలకు త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా కొమరవోలు పీఏసీఎస్ అధ్యక్షుడిగా పోట్లూరి రాజారావుతోపాటు ఇరువురు సభ్యులు గురువారం పర్సన్ ఇన్‌చార్జిలుగా , సంబంధిత కార్యదర్శుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. బాధ్యతలు స్వీకరించిన వారిని గ్రామ మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు, టీడీపీ గ్రామ నేతలు పూలమాల లేసి ఘనంగా సత్కరించారు. ఇదేవిధంగా ఉండ్రపూడి గ్రామ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా హేమ ప్రకాష్, ఉండ్రపూడి పీఏసీఎస్ కార్యదర్శి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్ పాల్గొన్నారు. ఇదే విధంగా కనుమూరు, భానుపూడి, నిమ్మలూరు, పామర్రు పర్సన్ ఇన్‌చార్జులుగా ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది.



రాజారావును అభినందిస్తున్న కాకరాల హరిబాబు

అధికారుల సమష్టి కృషితో అభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు, నాయకులు గుడివాడ రూరల్ మండల అభివృద్ధికి సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ అంశాలపై వివిధ శాఖల అధికారులు, నాయకులతో కలసి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వారికి అందేలా చూడాలన్నారు. రాజకీయాలకతీతంగా రూరల్ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించటానికి కృషి చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రూరల్ మండల అభివృద్ధి ప్రణాళికకు సూచనలు, సలహాలు అందించాలని కోరారు. మండలంలో ప్రతీ గ్రామం అభివృద్ధి చెందాలని కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు అభివృద్ధి విషయాల్లో సహకరించాలని ఆయన కోరారు. ఎంపీడీవో విష్ణు ప్రసాద్, తహసీల్దార్ కిరణ్, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి, వైస్ చైర్మన్ గొరిపర్తి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు వాసే మురళీ, టీడీపీ నాయకులు చేకూరి జగన్మోహనరావు, గోకవరపు సునీల్, వలివర్తిపాడు సాగునీటి సంఘం అధ్యక్షులు లింగమనేని వీరబసవయ్య, చీకటి శేషగిరి, రేమల్లి రజనీకాంత్, వంశీకృష్ణ, రంజిత్ కుమార్, కైలే కాళిదాసు, శొంఠి నాగేశ్వరరావు, కాటూరి శివాజీ, తాతయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్న వైసీపీ

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల పాలనలో ఎంతోమంది బీసీలపై దాడులు జరిగితే ఏ ఒక్క వైసీపీ నేత నోరు మెదపలేదని, అధికారం పోయాక వైసీపీకి బీసీలపై ప్రేమ పుట్టుకు రావటం కపట నాటకమేనని, ఈ దొంగ డ్రామాలతో టీడీపీకి బీసీలను దూరం చేయటం మీ తరం కాదని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. తోట్లవల్లూరు టీడీపీ కార్యాలయంలో గురువారం రాత్రి రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అధ్యక్షతన బీసీ చైతన్య సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ రాజకీయ స్వలాభం కోసం బీసీ మహిళ అయిన జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారికను గుడివాడ తీసుకు రావటం వైసీపీ నేతల రాజకీయ కుట్రలో భాగమేనని, ఇందుకు మాజీ మంత్రి పేర్ని నాని ఆడియో నిదర్శనమని అన్నారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ మాజీ మంత్రి కొఠారి ఈశ్వర్‌కుమార్ కొడాలి నానికి మద్దతునీయటం సిగ్గుచేటని, కొడాలి నాని గతంలో నీపై చేసిన దాడులు, కుట్రలు ఎలా మరిచావని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, సర్పంచ్ మూడే శివశంకర్, జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రామినేని కుటుంబయ్య, చింతపల్లి వెంకటేశ్వరరావు, నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, నెక్కలపూడి మురళీ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గొరిపర్తి గోపయ్య, వీరంకి పరశురామ్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్ రాజా



మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వడ్డెర వృత్తిదారుల సంఘం నేతలు

మహాసభలను జయప్రదం చేయాలి

గుడివాడ, జూలై 17(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఈ నెల 27,28 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం పట్టణ కమిటీ సభ్యులు చంద్రగిరి శివ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘ సభ్యులు రేపాని కొండ, బండి శ్రీను, చల్లా రాంబాబు, తమ్మిశెట్టి దుర్గారావు, చల్లా తిరుపతి, రేపాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ధ్వంసమైన చోరగూడి- పిచ్చుకలపాలెం రోడ్డు

రహదారి అధ్వానం

పమిడిముక్కల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చోరగూడి పంచాయతీ పరిధిలో గోపాలకృష్ణపురం, పిచ్చుకలపాడు రోడ్డు గుంతలమ యంగా తయారై ద్విచక్రవాహనాలు సైతం నడపలేని పరిస్థితి నెలకొంంది. అధ్వానంగా తయారైన రోడ్డులో వ్యవసాయ పనులకు వెళ్లేందుకు కూలీలు ఆటోలు, ఇతర వాహనాలలో వెళ్లవలసిన పరిస్థితుల్లో వాహనాలు పల్టీలు కొడుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భూముల రీ సర్వేపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న గురుమూర్తి రెడ్డి

నందివాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11 గ్రామాల్లో మిగిలి ఉన్న భూముల రీ సర్వేపై గురువారం మండల తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో నందివాడ తహసీల్దార్ కార్యాలయంలో మండల వీఆర్వోలకు , గ్రామాల సర్వేయర్లకు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 11 గ్రామాలలో మిగిలి ఉన్న భూ సర్వేలను ఏ విధంగా చేయాలో వివిధ అంశాలపై అవగాహన కల్పించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ సర్వేయర్ పరివీన్ సుల్తానా, రాహేలమ్మ, డీటీ గిరి కిషోర్, ఆర్ఐ గణేష్, పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న బాబుశ్రీకర్

ఆర్థిక సాయం

గుడివాడ, జూలై 17(ఆంధ్రజ్యోతి) : అగ్రికల్చర్ బీఎస్సీ ద్వితీయ సంవత్సర విద్యార్థి జొన్నలగడ్డ చందన చరిష్మాకు కళాశాల ఫీజు నిమిత్తం రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ, గవర్నేని చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రూ.33వేల చెక్కును విద్యార్థి తల్లికి క్లబ్ కౌన్సిలర్ జి.బాబుశ్రీకర్, క్లబ్ అధ్యక్షుడు యలమంచిలి నాగేశ్వరరావులు అందజేశారు. గురువారం స్థానిక రోటరీ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కిరణ్‌బాబు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభం

● ఉద్యానవన శాఖ అధికారి జి.జ్యోతి


కూచిపూడి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు తట్టుకుని లాభాలు ఆర్జించటానికి ఆయిల్‌పామ్ సాగు రైతులకు ఎంతగానో ఉపకరిస్తుందని కృష్ణా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి.జ్యోతి పేర్కొన్నారు. కూచిపూడికి చెందిన ఘంటసాల వెంకటరత్నానికి చెందిన పొలంలో గురువారం ఉద్యానవన శాఖ, త్రీఎఫ్ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త నిర్వహణలో పామాయిల్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నూరుశాతం రాయితీతో పామాయిల్ మొక్కలను రైతులకు అందించటంతోపాటు నాలుగు సంవత్సరాలపాటు ఎరువులు, నీటి యాజమాన్యం, అంతర్ పంటల సాగు నిర్వహణ కోసం హెక్టార్‌కు 21,500లు రాయితీ లభిస్తుందన్నారు. ఐదు ఎకరాలలోపు సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు నూరుశాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఈ అవకాశాలను రైతులు వినియోగించుకుని ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ కంపెనీ ఏజీఎం యు.విశ్రమ్ రాజ్, ఏపీ మైక్రో ఇరిగేషన్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బివి.రత్నాచార్యులు, ఘంటసాల కేవీకే శాస్త్రవేత్త వి.మంజువాణి, సర్పంచ్ కె.విజయలక్ష్మి, పామర్రు ఉద్యాన వన శాఖాధికారిణి జె.కీర్తిదేవ్ పాల్గొన్నారు.



పామాయిల్ మొక్కలు నాటుతున్న అధికారులు

చెరువులో గుర్రపుడెక్క తొలగింపు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు గ్రామపంచాయతీ రక్షిత తాగునీటిపథకం చెరువులో దట్టంగా గుర్రపుడెక్క, కర్రనాచు పేరుకుపోయింది. కాగా పంచాయతీ నిధులతో గత మూడు రోజులుగా యుద్ధప్రాతిపధికన తూడు నిర్మూలన పనులను నిర్వహిస్తున్నారు. తూడు తొలగించి చెరువులో తాగునీటిని నింపే ప్రక్రియ కొనసాగుతుందని పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు.





మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	106, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 520

మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కనపర్తి



ది వాయిస్ ఆఫ్ పీపుల్స్ పుస్తకాన్ని అందజేస్తున్న లోకేశ్

అవనిగడ్డ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిశీలకులు, కార్య నిర్వహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు గురువారం మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన పిలుపు మేరకు ఆయన లోకేశ్‌ను కలిశారు. యువగళం పాదయాత్ర అనుభవాలతో కూడిన ది వాయిస్ ఆఫ్ పీపుల్స్ పుస్తకాన్ని కనపర్తికి లోకేశ్ అందజేశారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ, పార్టీ పదవుల భర్తీ కార్యక్రమానికి సన్నాహం జరుగుతున్న వేళ లోకేశ్‌ను కనపర్తి కలవటం ప్రాధాన్యతను సంతరించుకుంది.



శివగంగ పీఏసీఎస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న పిప్పళ్ల కాంతారావు, డైరెక్టర్లు సుబ్బారావు, హేమశ్రీ

శివగంగ పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణస్వీకారం

మచిలీపట్నం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : శివగంగ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా పిప్పళ్ల కాంతారావు (వెంకన్న), డైరెక్టర్లుగా వడ్లమూడి వెంకట సుబ్బారావు, వై.హేమశ్రీ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, ఇలియాస్‌పాషా, పల్లపాటి సుబ్రహ్మణ్యం, ఫణికుమార్, కులవర్తి ఏడుకొండలు, సనకా నాగులు, తలారి రాంబాబు, ఆళ్ళ మాధవ, దేవరపల్లి అనిత, ఓకంటి రాంబాబు, గోకుల శివ, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో భారీ వర్షం

చల్లపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వేసవిని తలపించే ఎండలతో ప్రజలు అల్లాడుతున్న తరుణంలో గురువారం మధ్యాహ్నం చల్లపల్లిలో భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు సేద తీరారు. నారుమడులకు వర్షం జీవం పోసింది. సుమారు గంటకు పైగా భారీ వర్షం కురవటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచింది. నారాయణరావునగర్ కాలనీలో పైపులైను విస్తరణ పనుల నేపథ్యంలో రోడ్డుపక్కనే గోతులు తవ్వి, మట్టిగుట్టలు ఉంచటంతో రహదారి బురదమయంగా మారింది.



ముచ్చిలిగుంటలో మహిళకు కరపత్రాలు అందజేసి, పాఠశాల చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే తొలి అడుగు : కాగిత

పెడన రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకునేందుకు తొలి అడుగు కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ముచ్చిలిగుంట గ్రామంలో ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎయిడెడ్ పాఠశాలకు పక్కా భవనం లేక అంగన్‌వాడీ భవనంలో నిర్వహిస్తున్నారని, పిల్లలకు అసౌకర్యంగా ఉందని ప్రజలు తెలిపారు. తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకవచ్చారు. ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి నిధులు అందిస్తానన్నారు. ఇసకపర్ర డ్రెయిన్ పూడిక పనులు చేపట్టాలని రైతులు కోరారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, కాగిత నాగబాబు, కాగిత వాసు, కాగిత సోములు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రవాణా శాఖాధికారి మురళీధర్

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

అవనిగడ్డ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రతా నియమాల ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణా శాఖాధికారి టి.మురళీధర్ అన్నారు. అవనిగడ్డలోని ఎస్‌వీఎల్ క్రాంతి కళాశాలలో యువతకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ప్రమాదకరమైన బైక్ స్టంట్లు, కారు విన్యాసాలకు దూరంగా ఉండాలని సూచించారు. మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎండి.సిద్ధిక్ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పంట కాలువ గట్లలో జంగిల్ క్లియరెన్స్ పనులు పర్యవేక్షిస్తున్న తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

సాగునీరు అవరోధం లేకుండా చేరాలి

మచిలీపట్నం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కానూరు, తాళ్లపాలెం తదితర గ్రామాల్లోని పంట పొలాలకు సాగునీరు సక్రమంగా చేరేందుకు కాలువ గట్లు సరి చేయాలని, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. కానూరు గ్రామంలో రైతులు స్వచ్ఛందంగా కాలువ గట్లు సరి చేశారు. జంగిల్ క్లియరెన్స్ పనులకు శ్రీకారం చుట్టారు. జనసేన నాయకుడు దివి మహేష్, బొలిశెట్టి నాని, గోపు వెంకటరమణ, జొన్నల నాగమల్లేశ్వరరావు, సిద్ధిరెడ్డి పాండు, బోట్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి కుట్రలను శాంతియుతంగా తిప్పికొడతాం : గొర్రెపాటి

మచిలీపట్నం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జగన్‌రెడ్డి కుట్రలను శాంతియుతంగా తిప్పికొడతామని టీడీపీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు వయసు గురించి హేళనగా మాట్లాడుతున్న జగన్‌రెడ్డి, పేర్ని నానికి గోపీచంద్ సవాల్ విసిరారు. చంద్రబాబు రోజుకు 18 గంటలు పనిచేస్తున్నారన్నారు. చంద్రబాబుతో సమానంగా రామతీర్థం కొండ, అలిపిరి మెట్లు ఎక్కుతారా అని ప్రశ్నించారు. కుంచే నాని, పివి ఫణికుమార్ తదితరులు మాట్లాడారు.

హోం మంత్రి అనితకు ఘన స్వాగతం

● పోలీసుల గౌరవ వందనం



హోం మంత్రి అనితకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న మంత్రి రవీంద్ర, మొక్క అందజేసి స్వాగతం పలుకుతున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ గంగాధరరావు (పైన), పోలీసుల గౌరవ వందనం (దిగువ)

మచిలీపట్నం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : చిన కరగ్రహారంలో నిర్మిస్తున్న పోలీసు శిక్షణ కేంద్రం శంకుస్థాపనకు వచ్చిన హోం మంత్రి అనితకు పలువురు అధికార, అనధికారులు ఘన స్వాగతం పలికారు. హోం మంత్రి అనితకు మంత్రి కొల్లు రవీంద్ర పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. ఏలూరు రేజీ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ గంగాధరరావు, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవో స్వాతి మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆమె పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

టీడీపీ నాయకులు మోటమర్రి బాబాప్రసాద్, తలారి సోమశేఖర్, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, సమతాకీర్తి, కుంచే నాని, కాగిత వెంకటేశ్వరరావు, గోపు సత్యనారాయణ, తెలుగు మహిళలు లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మ, జనసేన నాయకులు గడ్డం రాజు ఘన స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



లంకమ్మ అమ్మవారికి సారె సమర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం మహిళలు



గంగానమ్మకు సారె తీసుకెళ్తున్న గౌడపాలెం భక్తులు

లంకమ్మ, గంగానమ్మకు ఆషాఢ సారె

అవనిగడ్డ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : దివి ప్రజల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారికి మండల ఆర్యవైశ్య మహిళలు ఆషాఢ సారెను సమర్పించారు. బస్టాండ్ సెంటర్ నుంచి రథంలో అమ్మవారి ప్రతిరూపాన్ని ఊరేగించారు. మహిళలు శోభాయాత్రగా అమ్మవారి ఆలయానికి తరలివెళ్లి ఆషాఢ సారెను సమర్పించారు. ఆర్యవైశ్య మహిళా కమిటీ పెద్దలు చెన్నగిరి మల్లికాంబ, మానేపల్లి పార్వతి, ఘంటసాల పద్మ, హైమావతి, ఆర్యవైశ్య సంఘ పెద్దలు దేను శేషు, విస్సంశెట్టి శ్రీనివాస్, కొల్లిపర రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోడూరు : కోడూరులో గంగానమ్మ అమ్మవారికి గౌడపాలెం భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. మేళతాళాల మధ్య పసుపు, కుంకుమ, పండ్లు, చలిమిడి, అరెసలు, పాల పొంగళ్లు, పట్టు వస్త్రాలను తీసుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



శాకంబరీదేవిగా వేళమ్మ

కోడూరు : లింగారెడ్డిపాలెంలో వేళమ్మ అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

షాదీఖానా అభివృద్ధికి కృషి

పెడన, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : షాదీఖానా అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. ఉర్దూ ఘర్ కం షాదీఖానా నూతన కమిటీ గురువారం బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్షుడిగా సాగిర్ అహమ్మద్, సభ్యులుగా మహమ్మద్ రఫీ, అబ్దుల్ వాహెద్, వజీర్ అహమ్మద్, ఉమేష్ ఉమయా నియమితులయ్యారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, తహసీల్దార్ కూనపరెడ్డి అనిల్‌కుమార్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.



షాదీఖానా కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే కాగిత, చిత్రంలో వేణుగోపాలరావు

ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, షాదీఖానా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ, షాదీఖానా నిర్మాణం, అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగాయన్నారు. మాజీ వైస్ చైర్మన్ రహమాన్‌బేగ్ మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం షాదీ ఖానాలను నిర్లక్ష్యం చేసిందన్నారు. షాదీఖానాకు అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాలని కోరారు. టీడీపీ నాయకులు యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, అయాబ్‌ఖాన్ (హన్ను), అబ్దుల్ ఖదీర్, కమ్మగంటి బాబు, గఫార్, పరసా సూర్యనారాయణ, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.



బస్టాండ్ పనులు డీఎం పరిశీలన

బంటుమిల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి బస్టాండ్ ఆధునీకరణ పనులను ఆర్టీసీ డీఎం టి పెద్దిరాజులు గురువారం పరిశీలించారు. దాదాపు రూ.40 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు, ఆర్టీసీ ప్రాంగణం మెరక చేసి ఫ్లోరింగ్ పనులు ప్రారంభించారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధి పనులు చేపట్టారు. ఏపీఎస్ ఆర్టీసీ ఏఈ సుభాని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తులసీరత్నం సేవలు చిరస్మరణీయం

చల్లపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సేవామూర్తి నాదెళ్ల తులసీరత్నం చిరస్మరణీయులని నిడుమోలు మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య అన్నారు. వితరణశీలి, ఆధ్యాత్మికవేత్త తులసీరత్నం సంస్మరణ కార్యక్రమాలు గురువారం జరిగాయి. తులసీరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుమారుడు శివరామకృష్ణను పరామర్శించారు. పురిటిగడ్డలో పీహెచ్‌సీ మంజూరుకు ఎమ్మెల్యేగా తాను కృషి చేసిన సమయంలో భవన నిర్మాణానికి స్థలం ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఆదర్శమూర్తి సీతారత్నం అన్నారు. పురిటిగడ్డతోపాటు పలు గ్రామాల పేద ప్రజలకు ఉపయోగపడే పీహెచ్‌సీ కోసం ఎంతో విలువైన 80 సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందించి ప్రభుత్వానికి తన వంతు సహకారాన్ని అందించన తులసీరత్నం సేవాభావం స్ఫూర్తిదాయకమన్నారు. వారి కుటుంబంతో అనుబంధాన్ని రామయ్య గుర్తుచేసుకున్నారు.



తులసీరత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాటూరు రామయ్య



సంస్మరణ సందర్భంగా గ్రామస్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న తులసీరత్నం కుటుంబ సభ్యులు

మొక్కల పంపిణీ

మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించేలా, మాతృమూర్తి గుర్తుగా సంస్మరణ కార్యక్రమానికి వచ్చిన వారందరికీ మొక్కలను పంచిపెట్టి సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు విశ్రాంత ఆర్డీవో నాదెళ్ల శివరామకృష్ణ. పురిటిగడ్డ పీహెచ్‌సీ స్థలదాత నాదెళ్ల తులసీరత్నం సంస్మరణ కార్యక్రమం గురువారం పురిటిగడ్డలో జరుగ్గా, పాల్గొన్న బంధుమిత్రులకు 1000 పూలు, పండ్ల మొక్కలను పంచిపెట్టారు. మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్, తులసీరత్నం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



జరుగువానిపాలెంలో తొలి అడుగు

కోడూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఆర్థికంగా పుంజుకుని అభివృద్ధి వైపు పయనిస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం గురువారం జరుగువానిపాలెం గ్రామంలో నిర్వహించారు. పూతబోయిన శ్రీనివాసరావు, అప్పికట్ల రవీంద్రబాబు, విస్సంశెట్టి నాగభాస్కర్ రావు, బత్తిన ఏడుకొండలు, అప్పికట్ల సిలోన్ బాబు, కోట రత్నారావు, విస్సంశెట్టి నెహ్రూబాబు, మహ్మద్ ఇమ్రాన్, అప్పికట్ల నరసింహా, బండే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పులిగడ్డను అభివృద్ధిపథంలో నడిపించాలి : సర్పంచ్ దాసరి

అవనిగడ్డ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డను అభివృద్ధిపథంలో నడిపించాలని సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ అన్నారు. నమస్తే డే కార్యక్రమం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగింది. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించి, పారిశుధ్య కార్మికులకు ఒక్కరూ సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి అనిత సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన

మచిలీపట్నం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కోన, పల్లెతుమ్మలపాలెం, కెపిటి పాలెం, వాడపాలెం, మాలకాయలంక, పోలాటితిప్ప, తుమ్మలచెరువు తదితర గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాఖాధికారులు ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పించారు. డిప్యూటీ డైరెక్టర్ కె. శంకర్, ఇరిగేషన్ అధికారులు మోహనరావు, రవికిరణ్, గౌతమ్, రామ్‌కుమార్, కెపిటి పాలెం సర్పంచ్ నాగపోతురాజు, డిసి వైస్‌చైర్మన్ సిహెచ్. రమణ, వక్కపట్ల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మనోహర్ పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాలు

నాగాయలంక, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇప్పటి వరకు 76 క్వింటాళ్ల పిల్లిపెసర, 71 క్వింటాళ్ల జీలుగ 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఏ.సంజీవ్ కుమార్ తెలిపారు. ఖరీఫ్ సాగు కోసం 585 క్వింటాళ్ల వరి బీపీటీ 5204 రకం విత్తనాన్ని రైతు సేవా కేంద్రాలలో పంపిణీ చేస్తున్నామన్నారు. మండలంలో మొత్తం 5555 రైతు కుటుంబాలను అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా ప్రకటించి రైతు సేవా కేంద్రాల్లో జాబితాలు ప్రదర్శనకు ఉంచామన్నారు. అర్హులైన వారి పేర్లు జాబితాలో లేనిచో రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకుని అర్హత పొందవచ్చన్నారు.